

సోమశిలకు 17,715 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగవ నుంచి శుక్ర వారం 17,715 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో డ్యాం నీటిమట్టం 38.100 టీఎంసీలకు చేరుకోగా ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6వేలు, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



ఇందుకూరుపేట: పసుపుగొమ్మల అలంకరణలో చాముండేశ్వరి





నెల్లూరు : విశేష అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు

వరలక్ష్మీ నమోస్తుతే!

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

- వివరాలు 8లో..

సోమశిల క్రస్ట్ గేట్లకు
కొత్త రోప్‌ల అమరిక

ప్రారంభమైన పనులు • ఇటీవల రూ.2.10 కోట్లు విడుదల

- వివరాలు 8లో..





అనుబంధానికి
ప్రతీక రాఖీ

సోదరి సోదరుల మధ్య అనుబం ధాన్ని తెలియజేసేదే రాఖీ పండుగ. శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. సోదరి తన సోదరుడికి రక్షా బంధన్‌ను కట్టి వారి శ్రేయస్సు, భద్రత కోసం ప్రార్థిస్తారు. ఇందుకు ప్రతీకగా సోదరులు తమ సోదరీమణులకు బహుమతులు ఇస్తారు. స్వీట్లు పంచుకుంటారు. దేవతలు, ప్రకృతి ఆరాధన, ఆత్మీయత, అనురాగ బంధాలు, సకల పూజారాధనలు ఉంటాయి. సంప్ర దాయ పద్ధతుల్లో శనివారం ఈ పండుగను జరుపు కునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందుకు అవసరమైన రకరకాల రాఖీలను, మిఠాయిలు, బహు మతులను ముందురోజే కొను గోలు చేసుకున్నారు. కాగా, శ్రావణ పౌర్ణమి రోజే జంధ్యాలను మార్చుకుంటారు. శనివారం బ్రాహ్మ ణులు తమ పాత జంధ్యాన్ని వదిలి శాస్త్రో క్తంగా కొత్త జంధ్యాలను ధరిస్తారు.

8 లో..

గోకులం..
పాడిరైతుకు వరం

- జిల్లాకు 2వేల యూనిట్ల మంజూరు

ఉదయగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం తర్వాత రైతులకు పశు పోషణే ప్రధాన జీవనాధారం. అలాంటి పాడి పరిశ్రమకు మరింత చేయూత ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత ఆర్థిక సంవ త్సరం లాగానే ఈసారి కూడా ఉపాధి హామీ పథకం నిధులతో పాడి రైతులకు మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయి. పశు పోషకులకు 90 శాతం మేర సబ్సిడీ ఇవ్వనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా కు 1,122 గోకులం షెడ్లు మంజూరవగా, రైతులు నిర్మించుకుని నూరు శాతం బిల్లులు పొందారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా జిల్లాకు 2వేల గోకులం షెడ్లు మంజూరయ్యాయి. షెడ్డు నిర్మాణ నిమిత్తం యూనిట్ వ్యయాన్ని రూ.1.15 లక్షల నుంచి 2.30 లక్షల వరకు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పలువురు పాడి రైతులు పశు వైద్యాధికారులు లేదా ఉపాధి హామీ పథకం ఏపీవోలకు దరఖాస్తులు అందజేస్తున్నారు. కొం దరు రైతులు నిర్మాణాలు కూడా చేపట్టారు. డ్వామా పీడీ గంగాభవాని మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన 2 వేల షెడ్లను రైతులు సద్వినియో గం చేసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి గోకులం షెడ్ లు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి తగు సూ చనలు, సల హాలు అందజే సినట్లు తెలి పారు.

గోకులం షెడ్డు రాయితీ వివరాలు (రూ.లలో)

షెడ్డు పరిధి	వ్యయం	సబ్సిడీ	లబ్ధిదారుడి వాటా
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 పశువులు	2,30,000	2,07,000	23,000



ఎమ్మార్పీకా..
అబ్బే.. వద్దు!

- 'బార్' యజమానుల నిట్టూర్పు
- వైసీపీ హయాంలో నిర్ణీత ధరకంటే ఎక్కువకు విక్రయాలు
- అప్పట్లో ఎగబడి దోచుకున్న వైనం
- నేడు నూతన పాలసీతో దోపిడీకి చెక్
- తమకు నష్టమేనంటూ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం?
- దరఖాస్తు వేసేందుకు వెనుకంజ?

నెల్లూరు (క్రైం) ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెలాఖరుతో బార్‌ల నిర్వహణ గడువు ముగియనుంది. ఈ నెల 15వ తేదీకే నూత న పాలసీని తీసుకొచ్చి 31వ తేదీలోపు బార్లు కేటాయించే ప్రక్రియను పూర్తి చేసి సెప్టెం బరు 1 నుంచి నూతన బార్లు ప్రారంభమ య్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుం టోంది. ఈక్రమంలో బార్లకు నూతన పాల సీపై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టత ఇచ్చారు. అయితే, మంత్రి మాటలు విన్న బార్ల యాజమాన్యం విస్తుపోతోంది. వెంటనే సమావేశమై నూతన పాలసీతో తమకు గిట్టుబాటు కాదని, దరఖాస్తు చేసు కోవడం కూడా అనవసరమని నిర్ణయించు కున్నట్లు సమాచారం.

• నూతన పాలసీతో బెంబేలు

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైన్‌షాపుల నిర్వహణ ప్రైవే టు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. దీంతో మద్యం షాపుల్లో ఎమ్మార్పీకే విక్రయించడం, మందుబాబులకు అవసరమైన బ్రాండ్లు దొర కడం, మర్యాద ఇవ్వడం వంటి చర్యలతో బార్లకు వెళ్లే మందుబాబుల సంఖ్య తగ్గిపో యింది. దీంతో ఎప్పుడెప్పుడు బార్ల కాల సమయం ముగుస్తుందా అని యాజమాన్యం ఎదురుచూస్తూ వచ్చింది. ఇదే సమయంలో ఈ నెల చివరకు బార్ల గడువు ముగియ నున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. 50వేల జనాభా ఉంటే రూ.35లక్షలు, 50వేల నుంచి 5లక్షల జనాభా ఉంటే రూ.55లక్షలు, 5లక్షల జనాభా దాటితే రూ.75లక్షలు బార్ లైసెన్సు ఫీజుగా నిర్ణయిం చింది. లాటరీ విధానంలోనే బార్ల కేటా యింపు జరుగుతుందని, ఎమ్మార్పీకే బార్లకు మద్యం ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీంతోపాటు ప్రస్తుతం ప్రైవేటు మద్యం దుకాణాలకు రూ.7.5లక్షలతో పర్మిట్ రూములను కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో బార్ల యాజమాన్యం పూర్తిగా ఖంగుతింది. మంత్రి మాటలపై ఇటీవల సమావేశమైన యజమానులు కొత్తపాలసీ వల్ల గిట్టుబాటు కాదని నిర్ణయించు కున్నట్లు సమాచారం. ఈ క్రమంలో జిల్లాలో ఎన్ని బార్లకు దరఖాస్తులు వస్తాయో వేచి చూడాలి.

నాడు ఇష్టానుసారంగా..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. ఇదే క్రమంలో బార్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని జనాభా ప్రాతిపదికన కేటాయించి ధరల ప్రకారం బిడ్‌లు వేసుకునేలా అవకాశం కల్పించింది. ఆ పాలసీలో బార్లకు ఇచ్చే మద్యంలో ఎలాంటి కమీషన్ లేదని ఎమ్మార్పీ కంటే అధికంగా చెల్లిస్తే స్టాక్ ఇస్తామంటూ నిబం ధనలు పెట్టింది. ఈ క్రమంలో జిల్లాలో 50బార్లకు పోటీపడి ఆన్‌లైన్‌లో దర ఖాస్తులు చేసుకుని వ్యాపారులు బార్లు దక్కించుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గతంలో వైన్‌షాపుల్లో పనిచేసిన సిబ్బందే అధికంగా సూపర్‌వై జర్లు, సేల్స్‌మెన్‌గా చేరడం, ఆయా ప్రాంతాల్లో నాయకుల అనుమతులతో సిబ్బందిని ఎక్సైజ్ అధికా రులు నియమించారు. మందుబాబులు ఎక్కువగా తాగే బ్రాండ్లను బార్లకు తరలించడం, వైన్‌షాపుల బయట మద్యం సేవిస్తే పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడం, ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. దీంతో ఎక్కువ శాతం మంది బార్‌లవైపే మొగ్గుచూపారు. దీంతో బార్ల యాజమాన్యం ఎమ్మార్పీ కంటే రూ.100 నుంచి 200లకు అదనంగా వసూలు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉన్న రోజులన్నీ బార్లకు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగింది.


తుమ్మలపెంటలో జలజీవన్ మిషన్
శిలాఫలకం, పైలాన్ ధ్వంసం

8 లో..

- టీడీపీ, వైసీపీ నేతల పరస్పర ఆరోపణలు
- పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు నమోదు

ఇంకెన్నాళ్లు!?

ఇంటర్ ఫలితాలను విడు దల చేసి ఐదు నెలలు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదల కాకపో వడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రవే శాల ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందా అని విద్యా ర్థులు, కళాశాలల యా జమాన్యాలు ఎదురుచూస్తున్నారు. సెప్టెంబరులోనైనా తరగతులు ప్రారంభమవుతాయా లేదా అన్న సందిగ్ధత అందరిలో నెలకొని ఉంది.



- డిగ్రీ అడ్మిషన్ల కోసం విద్యార్థుల ఎదురుచూపు
- ఇంటర్ ఫలితాలు వచ్చి ఐదు నెలలు
- నేటికీ నోటిఫికేషన్ విడుదల కాని వైనం
- ఆందోళనలో యాజమాన్యాలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంట ర్మీడియ్ పూర్తి చేసుకుని 5 నెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల కాకపోవ డంతో విద్యార్థులు ఆందోళన చెం దుతున్నారు. డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం కొనసాగిం చాలా లేదా డబుల్ మేజర్ విధానం ప్రవేశ పెట్టాలా అనే ఆలోచనే ఈ జాప్యానికి కార ణమని యాజమాన్యాలు చెబుతున్నాయి. గత ఏడాది వరకు సింగిల్ మేజర్ విధానం కొనసాగుతుండగా ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ విధానం ప్రవే శపెడతామని, ప్రతి కళాశాల అప్ గ్రేడ్ చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి సూచించింది. దీంతో ఆయా యాజమాన్యాలు నగదు చెల్లించి అనుమతులు సైతం తీసుకుని డబుల్ మేజర్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాయి. అలాగే గతంలో ఉన్న ఆన్‌లైన్ ప్రవేశాలను ఈ ఏడాది ఆఫ్‌లైన్ లో చేపడతారన్న ప్రచారం కూడా ఉం డటం, ప్రభుత్వం సింగిల్ మేజర్ విధా నంవైపు మొగ్గు చూప డం గందరగోళానికి కారణమైంది.

• మేజర్ విధానం అంటే

డిగ్రీలో సింగిల్, డబుల్ మేజర్ విధానం అంటే విద్యార్థి ఒకే ఒక్క ప్రధాన సబ్జెక్ట్‌ను మేజర్‌గా తీసు కుని, మిగిలిన సబ్జెక్ట్‌లను మైన ర్‌గా కానీ, సపోర్టివ్‌గా కానీ చద వాలి. ఉదాహరణకు బీఎస్సీ(ఫిజి క్స్)లో ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్ట్ కాగా, మిగిలిన కెమిస్ట్రీ, మ్యాథ్స్ వంటి సబ్జెక్ట్‌లు సపోర్టివ్‌గా ఉంటాయి. అలాగే డబుల్ మేజర్ విధానం అంటే రెండు ప్రధాన సబ్జెక్ట్‌లను మేజర్‌గా చదవాల్సి ఉంటుంది. ఉదాహర ణకు బీఏ (హిస్టరీ, పొలిటికల్‌సైన్స్)లో హిస్టరీ, పొలిటికల్ సైన్స్ ప్రధాన సబ్జెక్ట్ లుగా, వీటిని సమాన ప్రాధాన్యతతో చదివి, లోతుగా అవగాహన పెంచుకోవాల్సి ఉంటుంది.

• 10 వేలమంది ఎదురుచూపు

జిల్లావ్యాప్తంగా 61 డిగ్రీ కళాశాలలు ఉండగా, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఒకేషనల్, బీసీఏ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు కలిపి 32 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది అన్ని కళాశాలల్లో 9,087 అడ్మిషన్లు జరగ్గా ఈ ఏడాది 10 వేల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ గందరగోళంగా ఉండడంతో ఈ ఏడాది ఇప్పటివరకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ప్రభుత్వం నుంచి కమిటీ వచ్చి డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపా యాలు, ఇతర విషయాలను పరిశీలించి పునరుద్ధరణ చేప ట్టాలి. కానీ ఇప్పటివరకు ఇలాంటి ప్రక్రియ జిల్లాలో జరగ కపోవడం విశేషం. ప్రభుత్వ నిర్ణయం ఆలస్యం కారణంగా డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు అత్యధికమంది ఇతర కోర్సులపై వెళ్లిపోతున్నారని యాజమాన్యాలు చెబుతు న్నాయి. అలాగే కళాశాలలకు విడుదల కావాల్సిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు కూడా విడుదల కాకపోవ డంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023-24 సంవత్సరానికి మూడు క్వార్టర్‌లు, 2024-25 సంవత్సరానికి మూడు క్వార్టర్‌లు బకాయిలు విడుదల చేయాల్సి ఉంది.

• ప్రవేశాలు గందరగోళం

గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్ చేయడంతోపాటు మూడు ఫేజ్‌లలో నిర్వహించడంతో కళాశాలల్లో తరగతుల నిర్వహణ గందరగోళంగా మారింది. ప్రతి ఏడాది డిగ్రీలో చేరే విద్యార్థులు మొదటి ఫేజ్‌లో వచ్చిన కళాశాలలో ఇష్టమైన కోర్స్ రాకపోతే రెండో ఫేజ్‌లో పెట్టుకోవచ్చు. అదీ రాకపోతే మూడో ఫేజ్‌కు వెళ్లాలి. ఇలా జర గడం విద్యార్థుల్లో అసహనం, తరగతుల ప్రారంభంలో జాప్యం జరి గింది. ఈ ఆన్‌లైన్ ప్రవేశాల కారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురవుతు న్నారని యాజమన్యాలు చెపుతున్నాయి. కొన్నేళ్లుగా డిగ్రీ కోర్సులతో కూడా ఎన్నో సంస్థలు క్యాంపస్ ఎంపికల్లో ఉద్యోగాలు కల్పించడంతో పాటు విద్యావిధానంలో మార్పులు రావడంతో విద్యార్థులు ఆసక్తి పెంచుకుంటున్నారు. అయితే కొంతమందికి ఇష్టమైన కళాశాల, కోర్సులు రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ ఏడాదైనా ఈ గందరగోళానికి తెరదించి అడ్మిషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ విడు దల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

20 ఏళ్ల కల..
నేడు సాకారం!

- భగత్‌సింగ్ కాలనీవాసులకు పట్టాలు
- వర్చువల్‌గా అందజేయనున్న సీఎం చంద్రబాబు
- మొదటి విడతలో 650 మందికి పంపిణీ
- 2వ విడతలో మిగిలినవారికి ఇస్తామన్న నారాయణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని భగత్‌సింగ్‌కాలనీ వాసుల 20ఏళ్ల కల నేడు సాకారం కానుంది. పెన్నానది ఆనుకొని ఉండే ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా నివాసాలు ఉంటున్నా ఇళ్లకు శాశ్వత పట్టాలు మాత్రం అందలేదు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారా యణ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఏపీ కేబినెట్‌లో ముఖ్య మంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులను ఒప్పించి, పట్టాల పంపిణీకి ఆమోదం లభించేలా చేశారు. 1400 నివాసాలు ఉన్న భగ త్‌సింగ్‌కాలనీలో అందరికీ పట్టాలు పంపిణీ చేయను న్నారు. తొలివిడతగా 650 మందికి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వర్చువ ల్‌గా శనివారం పట్టాలను పంపిణీ చేయనున్నారు.



భగత్‌సింగ్ కాలనీ వ్యూ

ప్రతి హామీని నెరవేరుస్తున్నాం : నారాయణ

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నట్లు రాష్ట్ర మంత్రి పొం గూరు నారాయణ తెలిపారు. భగత్‌సింగ్‌కాలనీలో జరగనున్న పట్టాల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టాల పేరుతో పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చి ఈ ప్రాంతవాసులను మోసం చేసిందన్నారు. తాము ఇచ్చి న మాట ప్రకారం అందరికీ శాశ్వత పట్టాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట జేసీ కార్తీక్, కమిషనర్, నందన్, ఆర్డీవో అనూష, నాయకులు జహీర్, ముజీర్, జమీర్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

- తెల్లవారుజాము 3 గంటలపాటు భారీ వర్షం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టింది. వేకువజాము 3 నుంచి ఆరు గంటల వరకు ఏకదాటిగా కుండపోత వర్షం కురిసింది. మే నెలను తలపించేలా మండుతున్న ఎండల నుంచి జిల్లా ప్రజానీకానికి ఈ వర్షం కొంత ఊరటనిచ్చినట్టు అయ్యింది. కాగా, నగరంలోని మురుగు కాలు వల్లో చెత్తాచెదారాలు పేరుకోవటంతో నీటి ప్రవాహం ముందుకు కదలక, రోడ్డుపై ప్రవహించింది. ప్రధాన అండర్ బ్రిడ్జీలలో నీరు చేరటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లాలో సగటు వర్షపాతం 26.5 మి.మీగా నమోదైంది. అత్యధికంగా ఉదయగిరిలో 102.4, అత్యల్పంగా మర్రిపా డులో 1.3 మి.మీ వర్షం కురిసింది.

రైలులో పొగలు.. ప్రయాణికుల బెంబేలు!

- 'గంగా కావేరి'కి తప్పిన ప్రమాదం

మనుబోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గాలికి పోటీగా దూసుకెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులోని ఓ బోగిలోని చక్రాల మధ్య దట్టమైన పొగ రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. ఏదో ప్రమాదం జరగబోతుందని భయపడ్డారు. ఎలాగోలా రైలులో ఉన్న సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో లోకోపై లెట్ జాగ్రత్తగా రైలును ఆపివేశాడు. నెల్లూరు జిల్లా మను బోలు రైల్వే స్టేషన్ సమీపంలోని 102ఎల్‌సీ గేటు వద్ద శుక్ర వారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చాప్రా నుండి చెన్నై వెళుతున్న గంగా కావేరి ఎక్స్‌ప్రెస్ మనుబోలు స్టేషన్ దాటిన తరువాత ఇంజన్ పక్కనే ఉన్న బోగి కిందిభాగం నుంచి దట్టమైన పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన ప్రయాణికులు రైలును ఆపేందుకు ప్రయత్నించి లోకోపైలెట్‌కు తెలియజేశారు. దీంతో రైలు నిలపగానే హడావుడిగా కిందకు చాలామంది దిగేశారు. వెంటనే రైల్వే సిబ్బంది పొగలు వచ్చిన ప్రదేశాన్ని పరిశీలించారు. బ్రేకులు పట్టేయడం, చక్రాల రాపిడి వల్ల పొగలు వచ్చాయని తెలపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సాంకేతిక మరమ్మతులు, అన్ని పరిశీలించాక తిరిగి రైలు చెన్నై వైపు పరుగులు అందుకుంది. దీనివల్ల రైలు అర్ధగంటపాటు నిలిచింది.



బోగి కింద పొగలు వచ్చిన భాగాన్ని పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది

ఆంధ్రజ్యోతి
6 శనివారం, 9 ఆగస్టు 2025
www.andhrajyothy.com
కోవూరు
సర్వేపల్లి

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

వెంకటాచలం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ అమలులో భాగంగా నాయీ బ్రాహ్మణ సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడం సంతోషంగా ఉందని టీడీపీ జిల్లా కార్యదర్శి ఈదర శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు నాయీ బ్రాహ్మణుల తరపున ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9754
వెండి కిలో ధర	రూ. 118600
వెండి ఒక గ్రాము	రూ. 121.60

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

విడవలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వావిళ్ల గ్రామంలో వెలసిన ఆళగనాథస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో ఆలయ పూజారి పరాంకుశం కిశోర్ అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బొగ్గల మల్లికార్జున రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వాననీరు నిల్వ



నీటిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి) ఇటీవల కురిసిన భారీ వర్షానికి పెద్దూరులో మంగలికట్ట వద్ద గల జగనన్న కాలనీ జలమయమైంది. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పలువురు కాలనీ వాసులు టీడీపీ నాయకులకు తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జ్ దొడ్ల కోదండ రామిరెడ్డి, తదితర నాయకులు కాలనీలో పర్యటించారు. నిల్వ ఉన్న వాన నీటిని పరిశీలించారు. లేఔట్ ఏర్పాటు సమయంలో లెవలింగ్ చేయకుండా ఇళ్ళు నిర్మించడంతో వర్షాలకు రోడ్లు జలమయమౌతున్నాయని మహిళలు వాపోయారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసు కెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం



విరాళం అందజేస్తున్న పెంచలరాజు

రాపూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెంచల కోన ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదిలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి నంద నవనంలో సామూహిక కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. పరిమళ పత్రాలు, పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి కుంకుమార్చన చేశారు. కాగా శనివారం లక్ష తులసి దళార్చన జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

రూ.1,23,456 విరాళం

నిత్యాన్న ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం ఉదయగిరికి చెందిన కప్పా పెంచల రాజు, సరస్వతి దంపతులు రూ.1,23,456 విరాళాన్ని ఆలయ ఈవోకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందజేసి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేయాలి

విడవలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో దాడికి పాల్పడిన దోషులను అరెస్టు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. విడవలూరులో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతనెల 30న తెల్లగుంట ప్రాంతానికి చెందిన దళిత యువకుడు సిద్దన పాళేనికి చెందిన యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడని, ఈ విషయంపై పోలీసులు జోక్యం చేసుకుని తల్లిదండ్రులతో మాట్లాడి వివాదాన్ని పరిష్కరించారన్నారు. అయితే దీన్ని జీర్ణించుకోలేని సిద్దనపాళేనికి చెందిన కొందరు వ్యక్తులు ఈనెల 2న దళిత యువకునితో పాటు గ్రామంలో ఉన్న దళితులందరిని దుర్భాషలాడుతూ దాడి చేశారన్నారు. దళితులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దానం మాల్యాద్రి, పొంగలూరు సుధాకర్, గంగపట్నం సతీష్, దర్శిగుంట వాసు తదితరులు పాల్గొన్నారు.

వేగూరు డ్రెయిన్.. అన్నదాతల పరేషాన్!

- సాగునీటికి ఇబ్బందులు పడుతున్న రైతులు
- చర్యలు తీసుకుంటామన్న అధికారులు



గుర్రపు డెక్కతో నిండిపోయిన వేగూరు డ్రెయిన్ కాలువ

విడవలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కోవూరు, విడవలూరు మండలాల్లోని సుమారు నాలుగు గ్రామాల రైతులకు సాగునీరు అందించే వేగూరు డ్రెయిన్ కాలువ పూడిక తీతకు నోచుకోక కునారిల్లుతోంది. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. డ్రెయిన్ కాలువలో పూడిక తీయించాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందక పైర్లు ఎండిపోతున్నాయని వాపోతున్నారు.

● **సాగునీటికి ఇబ్బందులు :** కోవూరు మండలం వేగూరు, విడవలూరు మండలం చెలికల, ముదివర్తి, మన్మథరావుపేటలో కొంత భాగం వరకు సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు ఈ వేగూరు డ్రెయిన్ ద్వారానే అందుతుంది. వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ డ్రెయిన్ పూడిక తీత పనులు.. ప్రభుత్వం మారినా నేటికీ ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. కాలువలో పూడిక తీసి కొన్ని సంవత్సరాలు గడుస్తుండటంతో కాలువ మొత్తం గుర్రపు డెక్క, గడ్డితో దట్టంగా పెరిగింది. దీంతో సాగునీటి ప్రవాహనికి ఇది అడ్డంకిగా మారటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొట్టదశలో ఉన్న వరి పైర్లకి సకాలంలో నీరు అందకపోతే దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని వేగూరు డ్రెయిన్ కాలువలో పూడిక తీయించాలని, సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టి పంటలు దెబ్బతినకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పూడిక తీత పనులు చేపడతాం :

వేగూరు కాలువ గుర్రపు డెక్కతో నిండుకుని ఉందన్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే డ్రెయిన్ కాలువలో పూడిక తీత పనులు ప్రారంభిస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- పార్థసారథి, డ్రెయిన్ ఏఈ

గ్రామ దేవతల ఆలయాలను అభివృద్ధి చేస్తాం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



ముత్తుకూరు: సిద్ధేశ్వరాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో గ్రామదేవతలైన గంగ మ్మ, పోలేరమ్మ ఆలయాల అభివృద్ధికి అ న్ని విధాల కృషి చేస్తానని సర్వేపల్లి ఎమ్మె ల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొ న్నారు. పొదలకూరు పట్టణంలోని గ్రామ శక్తిస్వరూపిణి శ్రీగంగమ్మ తల్లి కొలుపు మహోత్సవంలో శుక్రవారం ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొలుపు మహోత్సవాన్ని తిలకించారు. పొదలకూరులో గ్రామ దేవతలు ప్రసిద్ధిగాంచారని పేర్కొన్నారు. రెండు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లాలి వెంకటేశ్వర్లు, సెక్రటరీ కుమార్, ట్రెజరర్ శ్రీధర్, సభ్యులు పెద్ద గొల్ల మద్దిరెళ్ల నరసింహులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **సిద్ధేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి**

ముత్తుకూరు : కృష్ణపట్నంలోని పురాతన సిద్ధేశ్వర, వేణుగోపాలస్వామి దేవస్థానాల అభివృద్ధికి కృషి చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. వరలక్ష్మీ వత్రం సందర్భంగా కృష్ణపట్నంలోని అతి పురాతనమైన శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేష్‌శర్మ వేద మంత్రాల నడుమ ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పురాతన ఆలయాలకు సంబంధించిన 513 ఎకరాల భూములకు 7,77,000 వంతున భూసేకరణ సమయంలో పరిహారం ఇప్పించామన్నారు. ఆ పరిహారం నగదును జాగ్రత్త చేయడంతో ప్రస్తుతం ఈ ఆలయాలకు రూ.100 కోట్ల నగదు 60 కేజీల బంగారం ఉందన్నారు. ఆలయ ఆస్తులను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రాగాల శివకృష్ణ, బొనిగి ఆనందయ్య, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వరికోతలు పూర్తి కాగానే జల్‌జీవన్ మిషన్ పనులు



రైతుల సమస్యను డీఈకి వివరిస్తున్న లక్ష్మీనరసారెడ్డి

కోవూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరికోతలు పూర్తి కాగానే జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభిం చాలని పాటూరు నీటి సం ఘాల ఉపాధ్యక్షుడు శింగా రెడ్డి లక్ష్మీనరసారెడ్డి కోరారు. మండల పరిధిలోని గంగ వరం గ్రామంలో రూ.33 లక్ష లతో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసారెడ్డి మాట్లాడుతూ తమ గ్రామం కోసం శాసనసభ్యులు ప్రశాంతిరెడ్డి ప్రత్యేకంగా జల్‌జీవన్‌మిషన్ నిధులు విడుదల చేయించారన్నారు. దీంతో గ్రామంలో మంచినీటి పైపుల లీకేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ఈ పనుల్లో భాగంగా రోడ్లు తవ్వాల్సి వస్తుందని, వరికోతల సమయంలో ధాన్యం లారీలు, ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇబ్బందులు వస్తాయని డీఈకి వివరించారు. దీంతో డీఈ సాను కూలంగా స్పందించారు. సెప్టెంబర్ నెలాఖరు నుంచి పనులు చేయిస్తా మన్నారు. మట్టితో సింక్ చేసి సిమెంటు రోడ్డు వేయిస్తామన్నారు. ఆయన వెంట ఏఈ చైతన్య, లక్ష్మీనరసారెడ్డి, శ్రీహరిరెడ్డి, తదితరులున్నారు.

● **గంగవరం దళితవాడకు వంతెన**

గంగవరం దళితవాడలో కాలువపై వంతెన నిర్మించనున్నట్లు పాటూరు నీటిసంఘాల ఉపాధ్యక్షులు శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేకంగా సిమెంటు రోడ్డు, వంతెనలు నిర్మించాలని ఆదేశించారన్నారు. దీంతో కొత్త కనెక్టివిటీ ఏర్పడుతుందన్నారు. భూములకు ధరలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందన్నారు.

అర్ధరాత్రి.. అకాల వర్షం!

బుచ్చిరెడ్డిపాళెంలో రోడ్లు జలమయం



బుచ్చిలో కుండపోతగా కురుస్తున్న వర్షం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతోపాటు మండలంలో గురువారం అర్ధరాత్రినుంచి శుక్రవారం ఉదయం దాకా భారీ ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. దీంతో బుచ్చి పట్టణంతోపాటు పలుచోట్ల రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. బుచ్చి జాతీయ రహదారిపై వాహన రాకపోకలు స్తంభించే పరిస్థితి నెలకొంది. గత కొన్ని రోజులుగా ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండ తీవ్రతకు ప్రజలు, ద్విచక్ర వాహనదారులు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో కొంతమేర వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలకు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించింది. అయితే ఈ వర్షం రెండోపంట వరిపైర్లకు మేలు చేస్తుందని రైతులు అంటున్నారు. అగ్గి తెగులును తలపించేలా కొనలు ఎర్రబారడం, ఆకులు చిట్లిపోవడం లాంటి చీడపీడలను నివారిస్తుందని చెబుతున్నారు. కాగా పంట ఎన్ను దశలో వున్న రైతులకు మాత్రం ఈ వాన వెన్నులో వణుకు పుట్టించింది. అయితే తెల్లవారగానే వర్షం ఆగిపోవడంతో రైతులంతా ఊపిరి పీల్చుకున్నారు.

చిరుజల్లులకే మడుగులు

- రోడ్డుపై నిలుస్తున్న నీరు... ప్రజల ఇక్కట్లు



కావలి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళ రావునగర్ బోర్డు సమీపంలో ఉన్న ఉదయగిరి రోడ్డుపై చిరుజల్లులు కురిసినా, రోజుల తరబడి నీరు నిల్వ ఉం టుంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో రాకపోకలకు వాహనచోదకులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. కావలి-ఉదయగిరి రోడ్డు ప్రస్తుతం నేషనల్ హైవేలో చేరింది. అక్కడ ఉన్న తారు రోడ్డుపై వర్షపునీరు పెద్దపెద్ద మడుగులుగా నిల్వ చేరింది. ఆ రోడ్డుపై పడిన వర్షపునీరు దక్షిణం వైపున ఉన్న కాలు వలోకి వెళ్లాల్సి ఉండగా, ఆ కాలువను ఆక్రమణదారులు పూర్తిగా మూసేశారు. దీనికితోడు రోడ్డు వెంబడి వెలసి న ఆక్రమణ దారులు తమ దుకాణాల ముందు ఎత్తుగా మట్టి తోలుకోవటంతో ఇక ఆ నీరు ఎటూ పోయేందుకు వీలు లేక అక్కడే నిలిచి పోతున్నాయి. ఇప్పటికైనా ము న్సిపల్ అధికారులు కానీ, నేషనల్ హైవే అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలి.

గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రోడ్డు

ఆత్మకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రోడ్లు గుంతలమయమై అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా నల్లపరెడ్డిపల్లి తారురోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డున ప్రయాణికులు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లికి, ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ళ, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కామాక్షితాయి సన్నిధిలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

భక్తులతో పోటెత్తిన జొన్నవాడ ఆలయం



సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో సామూహిక వర లక్ష్మీ వ్రతం అత్యంత వైభవంగా నిర్వ హించా రు. ముందుగా అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకార మండపంలో కొలువు దీర్చారు. అనంతరం పురోహితులు సాంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. ముత్తైదువలు అమ్మవారికి చీర, సారెలు సమర్పించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయం పోటెత్తింది. నిత్యాన్నదాన సదనంలో భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలో గంగా, కామాక్షి తాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి నిత్యకళ్యా ణోత్సవం, రాత్రి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకి సేవలు వైభవంగా జరిగాయి. మహిళలు చీర, సారెలు ఇచ్చి పుచ్చుకున్నారు. భక్తులు ముందుగా స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

ధనలక్ష్మి అలంకారంలో చతుర్భుజ లక్ష్మి

పెద్దూరులోని సీతా, లక్ష్మణ సమేత శ్రీ కోదండ రామ స్వామి ఆలయంలో మూడవ శ్రావణ శుక్ర వారం సందర్భంగా సామూహిక కుంకుమా ర్చన అత్యంత వైభవంగా జరిగింది. ఈ సంద ర్భంగా ఆలయ ప్రాంగణంలో చతుర్భుజ లక్ష్మి అమ్మ వారికి ఉదయం పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం నిర్వహించిన సామూహిక కుంకు మార్చనలో చతుర్భుజ లక్ష్మి అమ్మవారి ఉత్సవ మూర్తిని ధనలక్ష్మి అలంకారంలో కొలువు దీర్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీ కృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్య వేక్షించారు.

C.R.I.M.E N.E.W.S

కండలేరులో అక్రమ చేపల వేట

వాహనం పట్టివేత



చేపలు తరలిస్తున్న వాహనం

కలువాయి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశ యంలో అక్రమ చేపల వేట గుట్టు రట్టయింది. నిబంధ నలకు విరుద్ధంగా కొందరు అక్రమార్కులు జలాశయంలో వేటా డిన చేపలను తరలించు కుపోతున్న వాహనాన్ని పలువురు మత్స్య కారులు దాచూరు సమీపంలో శుక్రవారం అడ్డుకున్నారు. మత్స్యశాఖ అధికారులకు సమచారం ఇచ్చి స్వాధీనం చేశారు. ప్రస్తుతం చేపలు గుడ్డు దశలో ఉండటంతో జూలై, ఆగస్టు నెలల్లో జలాశయాల్లో చేపలు వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు ఇచ్చింది. అయినా కొందరు అక్రమార్కులు వ్యాపారుల సహకారంతో జలాశయంలో రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా వేటాడి జేబులు నింపుకుంటున్నారు. దీనిపై నిఘా ఉంచిన పలువురు మత్స్యకారులు కాపుకాచి జలాశయం వద్ద నుంచి చేపలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా మ త్స్యకారులు మాట్లాడుతూ నిషేధ సమయంలో జలాశయంలో అక్రమ చేపల వేట జరగకుండా మత్స్యశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై నెల్లూరు మత్స్యశాఖ ఏడీ చాంద్‌బాషా మాట్లాడుతూ అక్రమంగా చేపలు తరలిస్తున్న వాహ నాన్ని మత్స్యకారులు పట్టుకుని మాకు అప్పగించారు. మేము స్వాధీ నం చేసుకున్న 350 కేజీల చేపలకు వేలం నిర్వహించి తద్వారా వచ్చి న రూ.12 వేల నగదును ప్రభుత్వ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ పట్టివేత



వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్, డీటీఈ బాలకోటమ్మ

కోవూరు, ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): అనంత సాగరం నుంచి స్థానిక చెర్లోపాళెం సమీపంలోని రైస్ మిల్లుకు రేషన్ తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకు న్నారు. వివరాలిలా ఉన్నాయి... అనంత సాగరం నుంచి చెర్లోపాళెం సమీపంలోని రైస్ మిల్లుకు మినీ లారీలో రేషన్ తరలిస్తుండగా సాలుచింతల సమీపంలో పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. డ్రైవరు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దారు బాలకోటమ్మ పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ఉలవపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొ నగా డ్రైవర్ మృతి చెం దాడు. ఈ సంఘటన శుక్రవారం వీరేపల్లి జాతీయ రహ దారిపై చోటు చేసుకుం ది. పోలీసుల కథనం మేరకు, చెన్నైకి చెందిన లారీ ఒంగోలు వైపు వెళుతోంది. మార్గ మధ్యలో వీరేపల్లి వద్దకు వచ్చేసరికి హైవే డివైడర్ మధ్యలోని చెట్లకు నీళ్లు పెడుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ లారీలో ఇరుక్కుపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని హైవే మొబైల్ పోలీసులు, ఎస్‌ఐ అంకమ్మ లారీ నుంచి బయటకు తీసి హైవే అం బులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో చనిపోవడంతో కావలి ఏరియా ఆసుపత్రి మార్చురీలో డ్రైవర్ మృతదేహాన్ని భద్రపరిచారు. మృతుడు చెన్నైలోని పాండు రంగ నగర్‌కి చెందిన మహమ్మద్ రియాజ్ అని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

● **వాహనం ఢీకొని యువకుడు..**

మర్రిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడు కడప జిల్లా బద్వేల్‌కి చెందిన మహ్మద్ (22)గా పోలీసులు గుర్తించారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు... ఆత్మకూరు మండలం రామస్వామిపల్లిలో ఉన్న అవ్వ దగ్గరకు మహ్మద్ తన స్నేహితునితో కలిసి వెళ్లి తిరిగి ఇద్దరూ బైక్‌పై బద్వేల్ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహ్మద్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై ఉన్న స్నేహితునికి తీవ్ర గాయాలు కావడంతో 108 సహాయంతో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నజీర్ తెలిపారు. మృతుని తల్లిదండ్రులు కువైట్‌లో ఉన్నట్లు సమాచారం.

గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు



వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చి ట్టెం కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. చెన్నైకు చెందిన నాగప్పన్ మణికంఠ, ఓ బాలుడు మద్యం, గంజాయికి బానిసలై నిత్యం మత్తు లో ఉండేవారు. గంజాయి విక్రయాలు చేస్తున్న చెన్నై సెంట్రల్‌కు చెందిన సూర్య, ఎలన్ జరీయన్‌ను కలిశారు. అందరూ కలిసి ఈ నెల 7వ తేదీ నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో కావలికి చేరుకున్నారు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి నుంచి రెండు కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు చేరుకుని, ఇక్కడి నుంచి చెన్నై వెళ్లేందుకు వేచి ఉన్నారు. ఈ సమాచారంతో ఎస్‌ఐ అయ్యప్ప తన సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండుకు వెళ్లగా పోలీసు జీపును చూసి నిందితులు పరారవుతుండగా వెంబ డించారు. నాగప్పన్ మణికంఠ ను, బాలుడిని పట్టుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మణింఠను అరెస్ట్ చేయగా, బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆటో చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆటో చోరీపై చిన్నబజారు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... వెంకటాచలం మండలం జోసఫ్‌పేటకు చెందిన ఆంటోని ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మే 2వ తేదీన ఆటోలో నెల్లూరుకు వచ్చాడు. రెడ్‌క్రాస్ గేటు వద్ద ఆటో పెట్టి కూరగాయల కోసం మార్కెట్‌లోకి వెళ్లాడు. వచ్చాక ఆటో కనిపించకపోవడంతో శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీ

నెల్లూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌మోపూరు పంచాయతీ మొగళ్ళపాళెంలోని పంటపొలాల్లో ఉండే విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లోని రాగి తీగ చోరీకి గురైంది. గ్రామంలోని కీలుకుప్ప రాజేష్‌కు చెందిన 25 కేవీ ట్రాన్స్‌పార్మర్‌లోని రాగి తీగను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించు కువెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100): 490	



గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న భక్తులు

వందే ముకుంద ప్రియాం..!

- వైభవంగా వరలక్ష్మీ వ్రతం
- కిక్కిరిసిన ఆలయాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం నగర వాసులు వైభవంగా జరుపుకున్నారు. ఇళ్లలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. ఆలయాలు, అపార్టుమెంట్లలో సామూహిక వ్రతాలు జరిగాయి. భక్తుల రద్దీతో ఆలయాలు కిక్కిరిశాయి.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తుల రద్దీ

● రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిగింది. ఉదయం ముఖ్య అతిథులుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి 1116 మంది మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

● శబరి శ్రీరామ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ప్రధాన అర్చకుడు నరేష్ స్వామి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అభిషేకా లు, హోమాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



రాజరాజేశ్వరి ఆలయంలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి సుజిత, సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

● మూలస్థానేశ్వరాలయంలో వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. భువనేశ్వరి అమ్మవారికి నవావరణ పూజ జరిపారు. ఈవో శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతానికి వందలాది మంది మహిళా భక్తులు హాజరయ్యారు. అభిషేకాలు, పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి సామూహిక కుంకుమపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈవో వీ గిరికృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. సాయంత్రం మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు. అమ్మవారికి పూలంగిసేవ, బంగారు చీర అలంకారం భక్తులు కనువిందు చేశాయి. ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, వర్కింగ్ చైర్మన్ షేగు షణ్ముఖరావు, పాలక మండలి సభ్యులు, ప్రధాన అర్చకుడు శివకుమార్ స్వామి పర్యవేక్షించారు.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో వరలక్ష్మీ వ్రతం, సామూహిక కంకుమ పూజ జరిగాయి. అర్చకుడు బీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

● నారాయణ విద్యాసంస్థల్లో...

నెల్లూరు(విద్య), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేశారు. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియచేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం జరిపినట్లు నిర్వాహకులు తెలిపారు. ఏజీఎంలు రవివర్మ, శ్రీనివాసులు రెడ్డి, ప్రిన్సిపాల్ నాగమణి, సుప్రజ పాల్గొన్నారు.

● వేదగిరిపై వేడుకలు

నెల్లూరురూరల్, ఆగస్టు 8,(ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం సందర్భంగా వేదగిరి నరసింహస్వామి క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం పల్లకీ సేవ జరిపారు. ఈవో గోపి, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షించారు.

మహాలక్ష్మి ఆలయంలో బోనాలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోదండరామాపురంలో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం 17వ వార్షికోత్సవం, మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, మాతృకాపూజ, అమ్మవారికి అభిషేకం, వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజ జరిగాయి. సాయంత్రం ఉస్మాన్‌సాహెబ్‌పేట శివాలయం నుంచి మహాలక్ష్మీ ఆలయం వరకు వందలాది మంది మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ పర్యవేక్షించింది.



ఆలయంలో బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళా భక్తులు

వేకువజామున భారీ వర్షం

● తెల్లవారే వరకు కురవడంతో చల్లబడ్డ నగరం

నెల్లూరు(సిటీ), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తీవ్రమైన ఎండలతో కొన్ని నెలలుగా అగ్ని గుండంగా మండుతున్న నెల్లూరు నగరం ఎట్టకేలకు చల్లబడింది. శుక్రవారం వేకువజామున నగరంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. తెల్లవారే వరకు వర్షం కురవడంతో నేలతల్లి శాంతించింది. మరోవైపు నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలిగింది. కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగి యంత్రాల సహాయంతో నీటిని కాలువలకు మళ్లించారు.

ముందుజాగ్రత్తలు తీసుకోండి

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

వర్షాలొస్తున్నందున నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కొండాయపాళెం వద్ద నిలిచిన నీటిని ఆయన శుక్రవారం అధికారులతో కలసి పరిశీలించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు రైల్వే అధికారులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 29వ డివిజన్ సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో రూ. 22.20 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు.



లోతట్టు ప్రాంత పరిశీలనలో గిరిధర్‌రెడ్డి

వారంలో పరిశుభ్రమైన నీరు : డీఈ

లింగసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి వారంలో పరిశుభ్రమైన నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామని కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నవకిషోర్ చెప్పారు.శుక్రవారం ఏఈ రాజశేఖర్‌తో కలిసి ఆయన గుడ్లూరు, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాలను, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ ప్లాంటులోని మూడు ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు.వీటిలో రెండు బెడ్ల నుంచి మాత్రమే మంచినీరు ఫిల్టర్ అ వుతోందని, ఒక ఫిల్టర్ బెడ్ నుంచి నీరు ఫిల్టర్ కావ డం లేదన్నారు. ఈ ఫిల్టర్ బెడ్‌లోని చిన్నచిన్న రాయి లాంటి గ్రావెల్, ఇసుక తక్కువగా ఉందని, అలాగే ఈ బెడ్‌లోని పైపులు కూడా మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. వారంలో మరమ్మతు చేయించి, పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు అడ పా రంగయ్య, గాలంకి ప్రసాద్ పాల్గొన్నారు.

బాలసంస్కార్ కేంద్రానికి రూ.1లక్ష సాయం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జయభారత్ ఆసుపత్రి వారు గిరిజన కాలనీల్లో నిర్వహిస్తున్న బాల సంస్కార్ కేంద్రాల నిర్వహణకు ఆసుపత్రిలోని సింహపురి సేవా సమితి చైర్మన్ పొన్నలూరు సీతారామిరెడ్డి రూ.1లక్ష విరాళం అందజేశారు. తల్లితండ్రులు వీరరాఘవరెడ్డి, రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం విరాళాన్ని సంస్థ ఉపాధ్యక్షుడు బాల సుబ్బారావుకు అందించారు. బాలసంస్కార్ కేంద్రాల ద్వారా పిల్లలకు చదువుతోపాటు సంస్కారం, దేశభక్తి వంటివి నేర్పుతున్నారని దాత చెప్పారు. ఈ కార్యక్రమంలో గుర్రం సుధాకర్, గురుప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళం చెక్కు అందిస్తున్న సీతారామిరెడ్డి

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతు బజార్, వైఎంసీఏ, రాజేంద్ర నగర్, రంగనాయకులపేట, హరనాథపురం, సరస్వతీ నగర్, ఇరగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. రామచంద్రాపురం, ఎఫ్‌సీఏ కాలనీ, రాయప్పపాళెం, ఆచారి వీధి, రాయాజీ వీధి, ముంగమూరి వారి వీధి, ట్రంకురోడ్డు, మనుమసిద్ధి నగర్, పుత్తా ఎస్టేట్, గుప్తా పార్కు, ఈద్గా మిట్ట, రంగనాయకుల పేట, ఇసుకడొంక, కపాడిపాళెం, సంతపేట, హరనాథపురం, ఆకుతోట, చిల్డ్రన్స్ పార్కు, అయోధ్యానగర్, మధురానగర్, ఆపోలో ఆసుపత్రి ప్రాంతం, సరస్వతీ నగర్, రాంనగర్, పాత మిలిటరీ కాలనీ, క్రాంతి నగర్, టెక్కేమిట్ట, బట్వాడిపాళెం, శాంతి నగర్, రామయ్య బడి వీధి, ఏసీబీ కార్యాలయం ప్రాంతాల్లో సరఫరా ఉండదని అయన తెలిపారు.

పోషణ్ 2.0లో డేటా రక్షణ చర్యలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పోషణ్ 2.0 వ్యవస్థలో డేటా రక్షణ చర్యలు పాటిస్తున్నామని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ చెప్పారు. శుక్రవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. అంగన్‌వాడీ సేవలు, పోషణ్ అభియాన్ సేవలు, పోషణ్ 2.0 కింద విలీనమైనట్లు తెలిపారు. ఇందులో లబ్ధిదారుని డేటా రక్షణ ప్రోటోకాల్‌కు లోబడి ఉంటుందన్నారు.

రేపు 'బిగ్‌వేవ్' వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : బిగ్ వేవ్ ఈవెంట్స్ సంస్థ 17వ వార్షికోత్సవం ఆదివారం టౌనుహాలులో జరుగుతుందని ఆ సంస్థ అధ్యక్షుడు వైరవిబాబు తెలిపారు. శుక్రవారం నగరంలోని చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం శాస్త్రీయ, వెస్ట్రన్, జానపద నృత్య పోటీలు జరుగుతాయని చెప్పారు. రాత్రి కోట రాధాకృష్ణ ఆధ్యాత్మిక ప్రవచనం, జ్యోతిష పండితుడు జీవీబీ మురళీకృష్ణకు సన్మానం జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా 100 మందితో నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

307 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పొ గాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 540పొగాకు బేళ్లు అమ్మకానికి తీసు కొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 233బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-2 76, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-17కారణాలతో 307బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.150, సగటు ధర రూ.201.90గా నమోదైంది.

శ్రీనివాస కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

ఉదయగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రంగనాయకులస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే శ్రీనివాస కల్యాణోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను సిద్ధంచేశారు. వేదపండి తులచే స్వామివారి కల్యాణోత్సవం అనంతరం ఉట్టి మహోత్సవం, పట్టణ పురవీధుల్లో స్వామివార్ల గ్రామోత్సవం చేపట్టనున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మెయిన్‌బజార్ గుండా రంగనాయకుల స్వామి ఆలయం వరకు తోరణాలు, జెండాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కాగా, కల్యాణోత్సవ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే మేక పాటి చంద్రశేఖర్‌రెడ్డి నాయకులతో కలిసి పరిశీలించారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

కొండ బిట్రగుంటలో శరవేగంగా పుష్కరిణి పనులు

బిట్రగుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంటలో శ్రీవారి పుష్కరిణి పునఃనిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయి. స్థానిక టీడీపీ నేత విజయ్‌కుమార్ యాదవ్, రంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోనేటిలోని నీటితొలగింపు పూర్తైంది. ఈ నెల 10న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులచే శంకుస్థాపన కార్యక్రమం ఉండటంతో పనులు మరింత ఊపందుకున్నాయి.

రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యాకు మునిసిపల్ విద్యార్థులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శనివారం నుంచి జరిగే 10వ రాష్ట్రస్థాయి ఆట్యాపాట్యా చాంపియన్‌షిప్‌నకు నగరంలోని ఏసీనగర్ ఎంఎస్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 9మంది ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎస్ రిషిత, ఏ వైష్ణవి, సీహెచ్ నందిని, డీ రిషిత, జీ కీర్తిప్రియ, ఎం జగదీష్, చంద్రవరుణ్, వైచరణ్, ఏ నందగోపాల్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీ పీ అజయ్‌కుమార్, పీఈటీ ఎస్‌కే రేష్మ, సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొనసాగుతున్న క్రీడాపోటీలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరు గుతున్న జిల్లాస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం కొనసాగాయి. బాస్కెట్‌బాల్, ఖోఖో, హాకీ, వాలీబాల్ పోటీల్లో స్త్రీ, పురుష జట్లు తలప డ్డాయి. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జోనల్ పోటీలకు ఎంపిక చేసినట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ తెలిపారు. మరో రెండు రోజులు పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



బాస్కెట్‌బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఫ్రెషర్స్ డేతో నూతనోత్సాహం: ఏబీసీడబ్ల్యూవో శ్రీదేవి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఫ్రెషర్స్‌డేతో విద్యార్థుల్లో నూతనోత్సాహం, ఆనందం వెల్లివిరుస్తుందని నెల్లూరు సహాయ బీసీ సంక్షేమాధికారి ఎం శ్రీదేవి అన్నారు. నగరంలోని బీవీనగర్ బీసీ బాలికల వసతి గృహంలో శుక్రవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. వసతిగృహ పరిసరాలు పరిశుభ్రం గా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ హాస్టల్లో వసతులు బాగున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి చైతన్య, ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహ సంక్షేమా. దికారి మమత, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్రెషర్స్ డేలో మాట్లాడుతున్న ఏబీసీడబ్ల్యూవో శ్రీదేవి

వాహనాలకు జరిమానా

కందుకూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. మోడిఫైడ్ సైలెన్సర్లు, మోడిఫైడ్ నెంబరు ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలకు జరిమానాలు విధించారు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించటంతో పాటు అటువంటి సైలెన్సర్లు, నెంబరుప్లేట్లను తొలగించారు. సీఐ అన్వర్ బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని పామూరుబస్టాండ్ సెంటర్‌లో ఉన్న శ్రీలక్ష్మీశ్రీనివాస కల్యాణమండపంలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటోడ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలు నడిపినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డంపింగ్ యార్డుల రహితంగా ఏపీ

● పురపాలక మంత్రి పొంగూరు నారాయణ ● నగరంలో విస్తృత పర్యటన

నెల్లూరు(సిటీ), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : రానున్న మూడేళ్లలో రాష్ట్రాన్ని డంపింగ్ యార్డుల రహితంగా తీర్చిదిద్దనున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం నగర శివార్లలోని అల్లీపురం వద్ద ఉన్న డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. గతేడాది అక్టోబరు 2వ తేదీన రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను చేపట్టామని, ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి రాష్ట్రాన్ని గ్రీన్ ఏపీగా మార్చుతున్నట్లు ప్రకటించారు. అల్లీపురం, దొంతాలిలోని డంపింగ్ యార్డుల్లో ఉన్న చెత్తను త్వరలో తొలగిస్తామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. కాగా, మంత్రి నగరంలోని పలు పార్కుల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. నూతన ఆట వస్తువులను ప్రారంభించారు. మైపాడు రోడ్డుపై స్మార్టు స్ట్రీట్ బజారు ఏర్పాటుకు జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో జేసీ కార్తీక్, కమిషనర్ నందన్, ఆర్డీవో అనూష, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

చిల్లర విమర్శల వల్లే 11 సీట్లు

నెల్లూరు(వెంకటేశ్వరపురం) : వీఆర్ హైస్కూల్‌పై ఇటీవల ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై మంత్రి నారాయణ స్పందించారు. తనపై మాట్లాడేందుకు ఏమీ లేకపోవడంతో వీఆర్ హైస్కూల్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అక్కడ పేద పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు మంచి భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి చిల్లర విమర్శలు చేసినందునే ప్రజలు వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు.

మూడు నెలల్లో రంగనాథ ఘాట్ పూర్తి

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ఘాట్, పినాకినీ పార్క్‌ను రానున్న మూడు నెలల్లో విస్తరించి పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. శుక్రవారం రంగనాథస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజల అనంతరం ఘాట్‌ను పరిశీలించారు. పినాకినీ పార్కులో బోట్ షికార్‌తోపాటు వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. రంగడి ఆలయంలో నీరు నిలబడకుండా ఉండే విధంగా రూ.5లక్షలలోపు పనులు సోమవారం నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

ఎన్నాళ్లీ దుస్థితి..!

● గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రోడ్డు



గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రోడ్డు

ఆత్మకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రోడ్లు గుంతలమయమై అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా నల్లపరెడ్డిపల్లి తారు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డున ప్రయాణికులు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లికి, ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ళ, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



అనుమతి లేకుండా తవ్వేసిన జలదంకి పెద్దచెరువుకట్ట

ఇదేందయ్యా... చెరువు కట్టను ఇట్టా తవ్వేశారు ?

జలదంకి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): స్థానిక పె ద్ద చెరువుకట్టను ఆనుకుని జాతీయరహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా పెద్దచెరువు కట్టను గట్టుపల్లి రోడ్డుకూ డలి సమీపంలో ఆరుడుగుల మీటరు వెడ ల్పుకు పైగా ఎన్‌హెచ్ 167బీజీ గుత్తేదారు త వ్వించేశారు. చెరువుకట్టను లోతుగా తవ్వడం చూసి ఆయకట్టు రైతులు ఇదేందయ్యా.. చెరు వుకట్టను ఇలా తవ్వేశారని నోరెళ్లబెడుతున్నారు. పలువురు రైతులు అక్కడ పనిచేస్తున్న సూపర్ వైజర్లను అడిగితే మాకేంతెలీదు మా పైవాళ్లు పనులు చేయమన్నారు చేస్తున్నాం... అని స మాధానమిస్తున్నారు. జలవనరులశాఖ అధికారుల దృష్టికి పలువురు గ్రామపెద్దలు ఈ విష యాన్ని తీసుకెళ్లగా మాకెలాంటి సమాచారం లేదని, మేమెలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పుకొస్తున్నారు. కట్ట తవ్వడంపై ఆయకట్టు రై తులు ఆందోళన చెందుతున్నారు.



కొత్తూరులో మురుగులో ఉన్న మంచినీటి పైపు

మురుగులో మంచినీరు కల్తీ

కోవూరు పంచాయతీ పరిధిలోని కొత్తూరు దళిత కాలనీలో రక్షిత తాగునీటి పథకం పైపు పగిలిపోవడంతో తాగునీరంతా మురుగు కాలువలో కలుస్తోంది. అంతేకాదు.. తాగునీటి పైపులోకి మురుగునీరు ప్రవహిస్తోంది. అది కాస్త.. కొళాయిల ద్వారా ఇళ్లల్లోకి చేరుతోంది. దీంతో మురుగు నీటినే వడగట్టుకుని తాగుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బందితో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేదని మహిళలు వాపోయారు. ఇదే మురుగునీరు మరికొన్నాళ్లు తాగితే రోగాలబారిన పడడం ఖాయమని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



చినుకు రాలింది.. చెట్టు చిగురించింది!

● కనువిందు చేస్తున్న ఉదయగిరి దుర్గం కొండలు

ఉదయగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అడపా దడపా కురుస్తున్న వర్షాలకు చెట్లు చిగురు తొడుగుతున్నాయి. కొండలు పచ్చదనం పరుచుకుంటున్నాయి. ఉదయగిరి దుర్గం, కోర్పుకొండలతోపాటు ఈప్రాంతంలో ఉన్న వెలుగొండ అడువులు పచ్చదనం సంతరించుకోవడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆ పచ్చటి అందాలు, ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ప్రజలు మైమరిచిపోతున్నారు.



చెల్లెమ్మకు ఆలయం

నిత్యం పూజలు చేస్తున్న ఓ అన్నయ్య

అందరూ ప్రేమకు చిహ్నంగా గుడులు కడితే.. ఓ అన్నయ్య మాత్రం రోడ్డు ప్రమాదంలో మరణించిన తన చెల్లిని మర్చిపోలేక ఏకంగా ఇంటి వద్దే ఆలయం నిర్మించి అందులో తన చెల్లి విగ్రహాన్ని పెట్టి నిత్యం పూజలు చేస్తున్నాడు. మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన చెంచయ్య, లక్ష్మమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. వారిలో శివప్రసాద్, సుబ్బలక్ష్మి ఇద్దరు చిన్నప్పటి నుండి కలిసి మెలిసి ప్రేమాను రాగాలతో పెరిగారు. దీంతో సుబ్బలక్ష్మి డిగ్రీ పూర్తి చేసి 2009లో అటవీ శాఖలో ఉద్యోగం సాధించింది. 2011లో తన చెల్లి సుబ్బ లక్ష్మితో కలిసి శివ ప్రసాద్ (అన్నయ్య) నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో నడుచుకుంటూ వస్తుం డగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తీవ్రం గా గాయపడిన సుబ్బలక్ష్మిని ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలోనే కన్ను మూసిం ది. శివప్రసాద్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అప్పటినుంచీ చెల్లిని మర్చిపోలేక శివప్రసాద్ తీవ్ర మనో వేదనకు గురయ్యాడు. చెల్లి పటానికి రోజూ పూజలు చేసేవాడు. ఆ తర్వాత రెండేళ్లకు (2013లో) గుంటూరు జిల్లా తెనాలిలో ప్రత్యేకంగా చెల్లి విగ్రహాన్ని తయారు చేయించాడు. ఇంటి వద్దే గుడి కట్టించి, సుబ్బలక్ష్మి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేస్తున్నాడు.

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)





వ్యక్తిగతీకరించిన రాఖీలు



బ్రాస్లెట్ రాఖీలు



సోదరీ సోదరుల రక్షా బంధం

● నేడు రాఖీ పౌర్ణమి

● మార్కెట్‌లో వేల రకాల రాఖీలు



రాఖీలను కొనుగోలు చేస్తున్న విద్యార్థులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సోదర సోదరీ మణుల మధ్య ఆత్మీయత, ప్రేమానురాగాలకు ప్రతీకగా చెప్పుకునేది రాఖీ పండుగ. ఏటా శ్రావణ పౌర్ణమి రోజున ఈ రక్షా బంధన్‌ను దేశ వ్యాప్తంగా జరుపుకుంటారు. సోదరీ మణులు సోదరుల చేతికి రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి వారు ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. అలాగే సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కలకాలం తోడుగా ఉంటానని భరోసా ఇవ్వడమే ఈ పండుగ అంతరార్థం. రాఖీ పండుగ పురాతనమైనది. దీనికి సంబంధించిన పురాణ, ఇతిహాసాలు, చారిత్రక గాథలు ఎన్నో ఉన్నాయి. ఈ పండుగను చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం శ్రావణ పౌర్ణమి విశేషమైనదని జ్యోతిష పండితులు చెబుతున్నారు. 1930 ఆగస్టు 9న ఉన్న గ్రహస్థితి మళ్లీ 2025 ఆగస్టు 9న పునరావృతం అవుతోందని అంటున్నారు.



రుద్రాక్ష రాఖీలు



సంప్రదాయ రాఖీలు





● రాఖీలు - రకాలు

రాఖీ పండుగ సందర్భంగా మార్కెట్లో అనేక రకాల రాఖీలు అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ రాఖీలు, ఫ్యాన్సీవి, కుంకుమ రాఖీలు, మౌలీ రాఖీలు, కార్టూన్ రాఖీలు, జరీ రాఖీలు, చెక్క రాఖీలు, స్టోన్ రాఖీలు, లుంబా రాఖీలు ఉన్నాయి. ఇవేకాక ఆర్డర్‌పై ప్రియమైన వారి ఫొటోలతో కూడా రాఖీలు చేసిస్తున్నారు.

నేడు ఆదివాసీ దినోత్సవం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గిరిజన భవన్‌లో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నా మని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ మల్లికార్జునరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందని, మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ ఆనంద్ పాల్గొంటారని తెలిపారు.

మహిళల ఉచిత ప్రయాణానికి ఘనంగా స్వాగతం పలకాలి

● ఆర్టీసీ సిబ్బందితో డీసీటీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో అందించనున్న ఉచిత ప్రయాణానికి ఘనంగా స్వాగతం పలకాలని నెల్లూరు జోనల్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కే రమేష్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని ఆర్టీసీ 1వ డిపో గ్యారేజ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఉచిత ప్రయాణ పథకం విజయ వంతం అయ్యేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఇందు లో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల పాత్ర కీలకమని తెలిపారు. ఎటువంటి ఫిర్యాదు రాకుండా చూడాలని ఆదేశించారు.



క్రస్ట్ గేట్లకు ఉన్న పాతరోప్స్

సోమశిల క్రస్ట్‌గేట్లకు కొత్త రోప్స్ పనులు

అనంతసాగరం ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి కీలక వ్యవస్థగా ఉన్న క్రస్ట్‌గేట్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.2.10 కోట్లతో పనులు పూర్తిచేసేలా నిధులు మంజూరు కాగా ఆ దిశగా పనులు ప్రారంభించారు. గత వైసీపీ హయాంలో డ్యాం అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు మనుగడ కాపాడేలా పాలకులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర సాంకేతిక సలహాదారు, విశ్రాంత జలవనరుల ఇంజనీరు కన్నయ్యానాయుడు ఇటీవల సోమశిలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి చేయాల్సిన అత్యవసర పనుల వివరాలు ప్రభుత్వానికి నివేదించారు. వెంటనే సీఎం చంద్రబాబునాయుడు ఆ పనులకు ఆమోదం తెలపగా నిధులు మంజూరు చేయడం జరిగింది, గతంలో గ్రీజు కూడా పూయకుండా వదిలేసిన గేట్ల రోప్‌లు అధ్వానస్థితికి చేరుకుని ప్రమాదభరితంగా ఉన్నాయి. వాటి స్థానంలో కొత్త రోప్స్ ఏర్పాటు పనులు ప్రారంభం అయ్యాయి. 12 గేట్ల రోప్స్‌ను మార్చేలా నిపుణులు కొలతలు తీసి అమర్చే పనుల్లో నిమగ్నమయ్యారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని కామాటివీధికి చెందిన రామచంద్రన్ అనే వృద్ధుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు రామచంద్రన్ వీఆర్సీ సెంటర్‌లో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నారు. గతనెల 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన కోసం గాలించినా జాడ తెలియలేదు. ఈ క్రమంలో షాపులో ఓ లెటర్‌ను గుర్తించారు. తాను అప్పులపాలయ్యానని, తనకోసం వెతకవద్దని అందులో రాసి ఉంది. కుటుంబ సభ్యులు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.

తుమ్మలపెంటలో జలజీవన్ మిషన్ శిలాఫలకం, పైలాన్ ధ్వంసం

● టీడీపీ, వైసీపీ నేతల పరస్పర ఆరోపణలు

● పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు నమోదు

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు

కావలి రూరల్ ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తుమ్మలపెంట పట్టపుపాలెం సెంటర్‌లో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పథకం పైలాన్‌ను, శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, ఇంటింటికి తాగునీరు అందించేందుకు 2021లో రూ. 33 కోట్ల కేంద్రం నిధులతో జలజీవన్ మిషన్‌ను గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అప్పటి మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చేతుల మీదుగా పైలాన్, శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఆ పైలాన్ చుట్టూ వైసీపీ నేతల ఇళ్ల స్థలాలు ఉండటం, ఆ సెంటర్‌లో స్థలానికి మంచి ధర పలకటంతో పైలాన్ చుట్టూ ఉన్న సుమారు 64 సెంట్ల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అక్రమ లేఅవుట్‌లపై ఉక్కుపాదం మోపిన ఎమ్పీడీవో శ్రీదేవి, పోలీసుల సాయంతో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పించారు. స్థలం చుట్టూ ట్రెంచ్ వేయించారు.

అర్ధరాత్రి విధ్వంసం

పైలాన్, శిలాఫలకం తమ స్థలాలకు అడ్డుగా ఉందని ఈనెల 6న అర్ధరాత్రి సమయంలో తుమ్మలపెంట సెంటర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేసి కొందరు వైసీపీ నేతలు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌తో పైలాన్, శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేయటంతో అనుమానించిన కొందరు గ్రామస్థులు శిథిలాల తొలగింపును సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. శిథిలాలను అక్కడ నుంచి తీసుకెళ్లి స్థానిక వైసీపీ నేతకు చెందిన పొలంలో వేశారు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న అన్నగారిపాలెం పంచాయతీ కార్యదర్శి పెనుగొండయ్య ఎమ్పీడీవో శ్రీదేవికి తెలియచేశారు. ఆమె ఆదేశాల మేరకు పెనుగొండయ్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు, గ్రామస్థులు పైలాన్‌ను, శిలాఫలకం శిథిలాలను పరిశీలించారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎమ్పీడీవో శ్రీదేవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పైలాన్‌ను, శిలాఫలకం కూల్చి శిథిలాలను తొలగించటంతోపాటు ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా ఏర్పాటు చేసిన ట్రెంచ్ కూడా తొలగించారు. దీంతో ఇది వైసీపీ నేతల పనేనని టీడీపీ నేతలు, గ్రామస్థులు ఆరోపిస్తుంటే.. టీడీపీ నేతలే చేయించారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజేశ్వరరావు, సిబ్బంది



తుమ్మలపెంటలో పైలాన్, శిలాఫలకం కూల్చివేసిన ప్రదేశంలో ఉన్న శిథిలాలు

వరలక్ష్మే నమోస్తుతే!

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటింటా భక్తులు వరలక్ష్మీదేవిని ప్రత్యేకంగా కొలువుదీర్చి శాస్త్రోక్తంగా పూజించారు. ఆలయాలు, అపార్ట్‌మెంట్లలో సామూహికంగా వ్రతాన్ని వైభవంగా నిర్వ హించారు. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి విశేష అలంకారాలు, పూలంగిసేవ కనువిందు చేశాయి. పెంచలకోన, నరసింహ కొండ, నెల్లూరులోని రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, కన్యకాపరమేశ్వరి తదితర ఆలయాల్లో పెద్దఎత్తున పూజలు జరిగాయి.



పొదలకూరు : 60వేల గాజుల అలంకరణలో శ్రీ లక్ష్మి అమ్మవారు



రాపూరు : పెంచలకోనలో విశేష అలంకరణలో ఆదిలక్ష్మి



నెల్లూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు



నెల్లూరు : రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తజనం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా అన్ని 11 కేవీ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 9754
వెండి కిలో ధర	రూ. 118600
వెండి ఒక గ్రాము	రూ. 121.60

వర్షాలకు రహదారుల ఛిద్రం

● వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం

ఉదయగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రంగా మారడంతో ప్రజలు, వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. శుక్రవారం తెల్లవారుజామున ఉదయగిరి పట్టణంలో కురిసిన భారీ వర్షానికి నీరు రహదారులపై ఉధృతంగా ప్రవహించడంతో గుంతలు ఏర్పడి, కంకరరాళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. పట్టణంలో ఏ వీధి చూసినా గుంతలు, తేలిన రాళ్లతో దర్శనమిస్తున్నాయి. వాటిపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు. అలాగే దుత్తలూరు మండలం తిమ్మాపురం గ్రామానికి వెళ్లే రహదారి గుంతల్లో వర్షపు నీరు చేరి బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


బురదమయంగా తిమ్మాపురం రహదారి



వర్షా కాలంలో పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు

సంగం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో పశువుల ఆరోగ్యంపై పశు పోషకులు శ్రద్ధ చూపాలని స్థానిక వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు సూచించారు.

? వర్షా కాలంలో పశువులకు ఎటువంటి వ్యాధులు సోకుతాయి. రక్షణ చర్యలు ఏమిటి.

! పశువులకు గాలికుంటు వ్యాధి, పచ్చిక దోమ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటి నివారణకు ముందుగా టీకాలు వేయించాలి. పశు వైద్య కేంద్రంలో ఉచితంగా టీకాలు వేస్తాం. పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

? రేబీస్ వ్యాధి నివారణకు పశు వైద్యశాలలో టీకాలు అందుబాటులో ఉన్నాయా.

! వీధి, పెంపుడు కుక్కలు మనుషులను, పశువులను కరిచినప్పుడు రేబీస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు పశు వైద్యకేంద్రంలో టీకాలు అందుబాటులో ఉన్నాయి. వీధికుక్కలతో పాటు, పెంపుడు కుక్కలకు ముందుగా రేబీస్ నివారణ టీకా వేయించుకోవాలి.

? రాయితీపై పశువుల దాణా సరఫరా అవుతోందా.

! ఇటీవల 10 టన్నుల దాణా సరఫరా అయింది. 50 శాతం రాయితీతో రైతులకు అందచేశారు.

? మండలానికి ఎన్ని గోకులం షెడ్లు మంజూరయ్యాయి.

! 103 దరఖాస్తులు రాగా మొదటి విడతలో 60 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలను ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


ఆత్మకూరు వెంకటేశ్వర ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు


సీతారామపురం : పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

ప్రత్యేక అలంకారాలలో అమ్మవారు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఆత్మకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా శుక్రవారం ఆత్మకూరులో ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే మహిళలు ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, అలఘనాధస్వామి ఆలయం, బీఎస్ఆర్ సెంటర్‌లోని మహాలక్ష్మీదేవి గుడి వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని మల్లెపూలతో అభిషేకించారు. ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. అనంతరం తాళ్లూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ గావించారు.

●**సంగం:** స్థానిక సంగమేశ్వరాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంగమేశ్వరాలయంలోని కామాక్షిదేవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు.

●**ఉదయగిరి:** ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు. మండలంలోని గండిపాళెం, కృష్ణంపల్లి, అప్పసముద్రం, కుర్రపల్లి, దుర్గం పల్లి, అయ్యవారిపల్లి, సున్నం వారిచింతల, అర్లపడియ, నంది పాడు, నర్రవాడ ఆలయాలతో పాటు పట్టణంలోని సంతాన లక్ష్మీ, పార్వతీ పరమేశ్వరాలయా లకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చ కులు అమ్మవారికి విశేష అలంకరణలు నిర్వహించి ప్రత్యే క పూజలు చేశారు. కాగా, స్థానిక బీసీ కాలనీ సమీపంలో ఉన్న సంతానలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం కడప జిల్లా బద్వేలు పట్టణానికి చెందిన టంగుటూరు శ్రీనివాసులు, లక్ష్మీ దంపతులు అమ్మవారికి రూ.26 వేల విలువ చేసే బంగారు నేత్రాలను ఆలయ కమిటీకి అందజేశారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రమైన వరికుంటపాడులోని వైకుంఠపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్తలు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పద్మావతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

●**వింజమూరు:** మండలంలోని వింధ్యాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నడిమూరు యాత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ భక్తులకు అన్నదానం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండల కేంద్రంలోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆలయ అర్చకులు పార్వతి అమ్మవారికి కుంకుమార్చన, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు.


ఉదయగిరి: ప్రత్యేక అలంకరణలో దుర్గంపల్లి ఉదయలక్ష్మి అమ్మవారు


వింజమూరు: వింధ్యాపరమేశ్వరి అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు


వరికుంటపాడు : ప్రత్యేక అలంకరణలో పద్మావతి అమ్మవారు

ఉరుములు, మెరుపులతో వర్ష బీభత్సం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు ఏకదాటిగా కురిసిన వర్షానికి తోడు ఉరుములు, మెరుపులతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. కాగా మండలంలోని వెంగళరావునగర్‌లో సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరమ్మతు పనులు చేపట్టిన సిబ్బంది విద్యుత్ సరఫరాను కొనసాగించే నేపథ్యంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. దీంతో మరోప్రాంతం నుంచి విద్యుత్ సరఫరాను కొనసాగించారు.

జనసైనికుడి దాతృత్వం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొట్టె వెంకటేశ్వర్లు పర్యటించారు. యర్రంరెడ్డిపల్లిలో ఇటీవల వివాహమైన పార్టీ కార్యకర్త కేశవ నివాసానికి వెళ్లిన ఆయన నూతన దంపతులను ఆశీర్వదించి దుస్తులు అందజేశారు. అలాగే తోటల చెరువుపల్లిలోను కార్యకర్తల పిలుపు మేరకు ఓ ముస్లిం కుటుంబానికి రూ. 10వేలు పెళ్లి కానుక నగదును అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పఠాన్ రసూల్, నాయకులు నిమ్మలపల్లి రామచైతన్య, కిరణ్, సుంకే మల్లికార్జున, వెంకట్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడుకు మీ-సేవ కేంద్రం మార్పు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు గ్రామానికి మంజూరైన మీ-సేవ కేంద్రాన్ని మండల కేంద్రమైన వరికుంటపాడుకు మార్పుచేసినట్లు నిర్వాహకులు తాళ్లూరి చిన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ప్రజలకు అనుకూలంగా రవాణా సౌకర్యం లేకపోవడంతో పాటు ల్యాండ్ లైన్ నెట్‌వర్కు కూడా సక్రమంగా ఉండడం లేదన్నారు. తరచూ విద్యుత్ సమస్య కూడా తలెత్తుతుండడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందించలేక పోతున్నామన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్రాన్ని మార్పు చేస్తున్నట్లుగా ఆదేశాలు అందాయన్నారు. కావున ఆప్రాంత పరిధిలోని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీపీఎం ఆందోళన


విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సంగం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత విద్యుత్ మీటర్లే ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం గృహ, వ్యవసాయ విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటువల్ల వినియోగదారులకు నష్టం వాటిల్లుతుందని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి

ఉదయగిరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రంగనాయకులస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే శ్రీనివాస కల్యాణోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను సిద్ధంచేశారు. వేదపండితులచే స్వామివారి కల్యాణోత్సవం అనంతరం ఉట్టి మహోత్సవం, పట్టణ పురవీధుల్లో స్వామివార్ల గ్రామోత్సవం చేపట్టనున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మెయిన్‌బజార్ గుండా రంగనాయకుల స్వామి ఆలయం వరకు తోరణాలు, జెండాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కాగా, కల్యాణోత్సవ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి నాయకులతో కలిసి పరిశీలించారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ దుస్థితి..!

● గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రోడ్డు


గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రోడ్డు

ఆత్మకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రోడ్లు గుంతలమయమై అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా నల్లపరెడ్డిపల్లి తారురోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డున ప్రయాణికులు వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లికి, ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ళ, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే గుంతలు ఎక్కడున్నాయో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

అదనపు సాయంతో పేదల సొంతింటి కల సాకారం


మర్రిపాడులో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలు

మర్రిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పేదలకు పక్కాగృహాలు మంజూరు చేసినా, ఆర్థికసాయం సరిపోక కొన్ని బేసిమెంట్ లెవల్‌లో ఆగిపోగా, మరికొన్ని పునాదులకే పరిమితం అయ్యాయి. నాడు రూ.1.80 లక్షలు సాయాన్ని లబ్ధిదారులకు మంజూరు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన సాయం పునాది దశలోనే ఖర్చయింది. గమనించిన తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో పునాది దశలో ఉన్న లబ్ధిదారులకు రూ.10వేలు, లెంటిల్ లెవల్‌లో రూ. 20వేలు, స్లాబ్ ఏరియాకు మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. మర్రిపాడు మండలంలో 994 ఇళ్లు మంజూరు కాగా వైసీపీ పాలనలో 7ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కాగా, ప్రభుత్వం మారిన తరువాత ఆ ఇళ్ల నిర్మాణాన్ని నిలుపుదల చేయకుండా తెలుగుదేశం ప్రభుత్వం అదనపు సాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించటంతో నిత్యం లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సహాయకులుగా ఉంటున్నారు. ఇప్పటికి మండలంలో 223 ఇళ్లు పూర్తికాగా, 301 వివిధ దశలలో ఉన్నాయి. మిగిలిన వాటిని కూడా త్వరగా నిర్మించుకునేలా చూస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపారు.

లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం

ప్రతీరోజూ లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇళ్లు నిర్మించుకోవాలని ప్రోత్సహిస్తున్నామని గృహ నిర్మాణ శాఖ ఏఇ రవికుమార్ తెలిపారు. సాయం అందించిన గృహాలన్నీ పరిశీలిస్తున్నాం. మండలంలో 322 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన వారిని కూడా ప్రోత్సహిస్తున్నామని ఏఇ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

కండలేరులో అక్రమ చేపల వేట

వాహనం పట్టివేత


చేపలు తరలిస్తున్న వాహనం

కలువాయి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయంలో అక్రమ చేపల వేట గుట్టు రట్టయింది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు అక్రమార్కులు జలాశయంలో వేటాడిన చేపలను తరలించుకుపోతున్న వాహనాన్ని పలువురు మత్స్య కారులు దాచూరు సమీపంలో శుక్రవారం అడ్డుకున్నారు. మత్స్యశాఖ అధికారులకు సమచారం ఇచ్చి స్వాధీనం చేశారు. ప్రస్తుతం చేపలు గుడ్డు దశలో ఉండటంతో జూలై, ఆగస్టు నెలల్లో జలాశయాల్లో చేపలు వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు ఇచ్చింది. అయినా కొందరు అక్రమార్కులు వ్యాపారుల సహకారంతో జలాశయంలో రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా వేటాడి జేబులు నింపుకుంటున్నారు. దీనిపై నిఘా ఉంచిన పలువురు మత్స్యకారులు కాపుకాచి జలాశయం వద్ద నుంచి చేపలు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా మ త్స్యకారులు మాట్లాడుతూ నిషేధ సమయంలో జలాశయంలో అక్రమ చేపల వేట జరగకుండా మత్స్యశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై నెల్లూరు మత్స్యశాఖ ఏడీ చాంద్‌బాషా మాట్లాడుతూ అక్రమంగా చేపలు తరలిస్తున్న వాహ నాన్ని మత్స్య కారులు పట్టుకుని మాకు అప్పగించారు. మేము స్వాధీ నం చేసుకున్న 350 కేజీల చేపలకు వేలం నిర్వహించి తద్వారా వచ్చి న రూ.12 వేల నగదును ప్రభుత్వ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ పట్టివేత


వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, డీటీఈ బాలకోటమ్మ

కోవూరు, ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): అనంత సాగరం నుంచి స్థానిక చెర్లోపాళెం సమీపంలోని రైస్ మిల్లుకు రేషన్ తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకు న్నారు. వివరాలిలా ఉన్నాయి... అనంత సాగరం నుంచి చెర్లోపాళెం సమీపంలోని రైస్ మిల్లుకు మినీ లారీలో రేషన్ తరలిస్తుండగా సాలుచింతల సమీపంలో పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. డ్రైవరు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దారు బాలకోటమ్మ పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ఉలవపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొ నగా డ్రైవర్ మృతి చెం దాడు. ఈ సంఘటన శుక్రవారం వీరేపల్లి జాతీయ రహ దారిపై చోటు చేసుకుం ది. పోలీసుల కథనం మేరకు, చెన్నైకి చెందిన లారీ ఒంగోలు వైపు వెళుతోంది. మార్గ మధ్యలో వీరేపల్లి వద్దకు వచ్చేసరికి హైవే డివైడర్ మధ్యలోని చెట్లకు నీళ్లు పెడుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ లారీలో ఇరుక్కుపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని హైవే మొబైల్ పోలీసులు, ఎస్ఐ అంకమ్మ లారీ నుంచి బయటకు తీసి హైవే అం బులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో చనిపోవడంతో కావలి ఏరియా ఆసుపత్రి మార్చురీలో డ్రైవర్ మృతదేహాన్ని భద్రపరిచారు. మృతుడు చెన్నైలోని పాండురంగ నగర్‌కి చెందిన మహమ్మద్ రియాజ్ అని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

● **వాహనం ఢీకొని యువకుడు..**

మర్రిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడు కడప జిల్లా బద్వేల్‌కి చెందిన మహ్మద్ (22)గా పోలీసులు గుర్తించారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు... ఆత్మకూరు మండలం రామస్వామిపల్లిలో ఉన్న అవ్వ దగ్గరకు మహ్మద్ తన స్నేహితునితో కలిసి వెళ్లి తిరిగి ఇద్దరూ బైక్‌పై బద్వేల్ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మహ్మద్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై ఉన్న స్నేహితునికి తీవ్ర గాయాలు కావడంతో 108 సహాయంతో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నజీర్ తెలిపారు. మృతుని తల్లిదండ్రులు కువైట్‌లో ఉన్నట్లు సమాచారం.

గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు


వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చి ట్టెం కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. చెన్నైకు చెందిన నాగప్పన్ మణికంఠ, ఓ బాలుడు మద్యం, గంజాయికి బానిసలై నిత్యం మత్తు లో ఉండేవారు. గంజాయి విక్రయాలు చేస్తున్న చెన్నై సెంట్రల్‌కు చెందిన సూర్య, ఎలన్ జరీయన్‌ను కలిశారు. అందరూ కలిసి ఈ నెల 7వ తేదీ నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో కావలికి చేరుకున్నారు. అక్కడ గుర్తుతెలియని వ్యక్తి నుంచి రెండు కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు చేరుకుని, ఇక్కడి నుంచి చెన్నై వెళ్లేందుకు వేచి ఉన్నారు. ఈ సమాచారంతో ఎస్ఐ అయ్యప్ప తన సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండుకు వెళ్లగా పోలీసు జీపును చూసి నిందితులు పరారవుతుండగా వెంబ డించారు. నాగప్పన్ మణికంఠ ను, బాలుడిని పట్టుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మణింఠను అరెస్ట్ చేయగా, బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆటో చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆటో చోరీపై చిన్నబజారు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... వెంకటాచలం మండలం జోసఫ్‌పేటకు చెందిన అంటోని ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మే 2వ తేదీన ఆటోలో నెల్లూరుకు వచ్చాడు. రెడ్‌క్రాస్ గేటు వద్ద ఆటో పెట్టి కూరగాయల కోసం మార్కెట్‌లోకి వెళ్లాడు. వచ్చాక ఆటో కనిపించకపోవడంతో శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీ

నెల్లూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌మోపూరు పంచాయతీ మొగళ్ళపాళెంలోని పంటపొలాల్లో ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీకి గురైంది. గ్రామంలోని కీలుకుప్ప రాజేష్‌కు చెందిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించు కువెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212

కోడిగుడ్ల ధర (100): 490

కోదండరాముడి సేవలో ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగొల్లు వడ్డెరపాలెంలో శుక్రవారం జరిగిన కోదండరాముడి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆలయంలో నిర్మించుకున్న కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీలోని సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం పెద్దలు కుంచాల శ్రీనివాసులు, తన్నీరు వెంకటరమణయ్య, ఉప్పుటూరి అంకారావు, ఉప సర్పంచి గుంజి రమణమ్మ, గుంజి శ్రీనివాసులు, తన్నీరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఊరూరా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

● ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కావలి : గీతామందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



కందుకూరు : కోదండ రామాలయంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



కలిగిరి : సిద్దనకొండూరులో వ్రతం చేస్తున్న మహిళలు

కావలి(టౌన్), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలుగోళ శాంభవి ఆలయం, గీతా మందిరం, సత్యనారాయణస్వామి ఆలయం, విష్ణాలయం, ముసునూరులోని మహాలక్ష్మమ్మ ఆల యం, హనుమత్ క్షేత్ర, శ్రీసాయిక్షేత్రం వెంగళరా వునగర్‌లోని ఆలయాల్లో శుక్రవారం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. లక్ష్మీదేవికి శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ పూజలు నిర్వహిస్తే కోరుకున్న కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. భక్తుల తాకిడితో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. కాగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కలుగోళ్ల శాంభవిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆయన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాధక్రిష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలు మండలంలో శ్రావణ శుక్ర వారం సందర్భంగా పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. కొండ బిట్ర గుంటలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యనా రాయణ చార్యుల ఆధ్వర్యంలో సామూహిక వర లక్ష్మీ వ్రతం చేశారు. కార్యక్రమానికి కొడవలూరు మండలం గండవరానికి చెందిన చింతం వెంక టశేషారెడ్డి-వాణీ మాధవి, చిన్నవెంకటశేషారెడ్డి- సులక్షణ, పోనుగోటి బాలకిరన్‌రెడ్డి-వెంకట కవిత ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అలాగే చె న్నారెడ్డి పాలెం, కొత్తూరులోని కోదండరామా లయం, నాగవరపమ్మ ఆలయాల్లో వ్రత పూజ లు నిర్వహించారు.

● **అల్లూరు** : వరలక్ష్మీ వ్రతా న్ని మండలంలోని అన్నీ శక్తి ఆలయాల్లో శుక్ర వారం నిర్వహించారు. పట్టణ పరిధిలోని పోలేరమ్మ ఆలయం, గంగమ్మ, కలుగోళమ్మ, అంకమ్మ, మహాలక్ష్మమ్మ, కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి.



కొండాపురంలోని ఓ ఇంటిలో అలంకరించిన లక్ష్మీదేవి ప్రతిమ

●**కందుకూరు** : పట్టణంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా, వందలాది మహిళలు పాల్గొన్నారు. పట్టణంలోని పెద్దబజారులో ఉన్న కోదండరామాలయంలో అ ర్చకులు అనిల్‌స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అ మ్మవారిని చందనం, కరెన్సీనోట్లతో అలంకరిం చారు. అనంతరం సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించగా, మద్దాళి సుబ్రహ్మణ్యం, శశికళ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. మండలంలోని మాచవరం అయ్యల్‌రెడ్డి కొండ పైన వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించగా మహిళలు పాల్గొన్నారు. గ్రామదేవత అంకమ్మ అమ్మవారిని వేలాదిభక్తులు దర్శించుకున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరికి వాసవీ వనితాక్లబ్ ఆధ్వర్యంలో సారెను సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

● **కలిగిరి** : గ్రామంలోని మ హాలక్ష్మమ్మ, కలిగిరిరమ్మ ఆలయాలతోపాటు సిద్దనకొండూరులోని సిద్దేశ్వరస్వామి ఆలయం లో శుక్ర వారం భక్తులు వరలక్ష్మీ వ్రతం చేశారు. సిద్దనకొండూరులో ఆలయ అర్చకులు పంచా గ్నుల శ్రీకాంత్‌శర్మ, హేమ చరణ్ శర్మల ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వరలక్ష్మీవ్రత కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● **కొండాపురం** : వరలక్ష్మీ వ్రత పూజలు శుక్రవారం మండలంలోని అన్నీ గ్రామాల్లో ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవా ర్లను పూలతో ప్రత్యేకంగా అలం కరించి పూజలుచేశారు.

● **లింగసముద్రం** : మండ లంలోని పలు గ్రామాల్లోని శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మండలంలోని పెదప వని, చినప వని, వీఆర్ కోట, లింగసముద్రం, మొగిలిచెర్ల తదితర గ్రామాలలోని ఆలయాలను సందర్శించిన మహిళా భక్తులు లక్ష్మీదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. లింగసముద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి గణపతి పూజ, వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా వసతిగృహాలు

● అరుణమ్మ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్

ఈ తరుణం...

కావలిటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా వసతి గృహాలు పనిచేస్తున్నాయని అసిస్టెంట్ బీసీ వెల్ఫేరు ఆఫీసర్ వీ. అరుణమ్మ తెలిపారు. పేద బీసీ విద్యార్థులు ప్రభుత్వ సంక్షేమ గృహాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

? : డివిజన్‌లో ఎన్ని బీసీ సంక్షేమ వసతి గృహాలున్నాయి.

! : ఏడు బీసీ వసతి గృహాలుండగా, కొత్త మరో నాలుగు కలవడంతో మొత్తం 11 అయ్యాయి.

? : అందులో బాలురకు ఎన్ని.. బాలికలకు ఎన్ని..

! : 8 బాలురకు, 3 బాలికలకు వసతి గృహాలున్నాయి. అందులో ఒకటి బాలుర పోస్ట్ మెట్రిక్ చదివేవారిది.

? : మొత్తం సీట్లెన్ని... ఎన్ని భర్తీ అయ్యాయి.

! : మొత్తం సీట్లు 1,140. భర్తీ అయినవి 679.

? : ఎలాంటి పౌష్టికాహారం అందిస్తున్నారు.

! : వారానికి 3 రోజులు చికెన్, 5 రోజులు గుడ్లు, ప్రతిరోజూ అరటి పండు, చిక్కీలు, పాలు, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నాం.

? : ఉత్తీర్ణత శాతం ఎలా ఉంది.

! : 88శాతంగా ఉంది.

? : అన్నింటికీ సొంత భవనాలేనా?

! : బాలుర పోస్ట్ మెట్రిక్ వసతి గృహం, యల్లాయపాలెంలోని రెండు వసతి గృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

ఆర్వోప్లాంట్‌కు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచు బసవయ్య నాయుడు

ఉలవపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్నేటికోటలో ఆర్వోప్లాంట్‌కు శుక్రవారం సర్పంచు పులివర్తి బసవయ్య నాయుడు భూమిపూజ నిర్వహించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్లాంట్‌కు అవసరమైన మిషనరీ సరఫరా చేయగా, పంచాయతీ నిధులతో ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు చిమ్మిరి వంశీకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు, నార్తుమోపూరు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్లలో పూర్తిగా సరఫరాను నిలిపివేస్తున్నామని, ఈ కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

307 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 540పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 233బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-276, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-17కారణాలతో 307బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.150, సగటు ధర రూ.201.90గా నమోదైంది.

ఇదేందయ్యా... చెరువు కట్టను ఇలా తవ్వేశారు ?

● ఆందోళనలో ఆయకట్టు రైతులు



అనుమతి లేకుండా తవ్వేసిన జలదంకి పెద్దచెరువుకట్ట

జలదంకి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్ద చెరువుకట్టను ఆనుకుని జాతీయరహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా పెద్దచెరువు కట్టను గట్టుపల్లి రోడ్డుకూడలి సమీపంలో ఆరుడుగుల మీటరు వెడల్పుకు పైగా ఎన్‌హెచ్ 167బీజీ గుత్తేదారు తవ్వించేశారు. చెరువుకట్టను లోతుగా తవ్వడం చూసి ఆయకట్టు రైతులు ఇదేందయ్యా.. చెరువుకట్టను ఇలా తవ్వేశారని నోరెళ్లబెడుతున్నారు. పలువురు రైతులు అక్కడ పనిచేస్తున్న సూపర్ వైజర్లను అడిగితే మాకేంతెలీదు మా పైవాళ్ల పనులు చేయమన్నారు చేస్తున్నాం... అని సమాధానమిస్తున్నారు. జలవనరులశాఖ అధికారుల దృష్టికి పలువురు గ్రామపెద్దలు ఈ విషయాన్ని తీసుకెళ్లగా మాకెలాంటి సమాచారం లేదని, మేమెలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పుకొస్తున్నారు. కట్ట తవ్వడంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఒరిగిన స్తంభంతో పొంచిన ముప్పు



పోలినేనిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోని పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభం

వలేటివారిపాలెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేనిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోని పొలాల్లో మెయిన్‌లైన్ విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఈ స్తంభం ఏ క్షణంలోనైనా కూలిపోయే అవకాశం ఉందని ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసి కొద్దిపాటి గాలి వీచిందంటే చాలు ఒరిగిపోయిన స్తంభం కూలి పోతుందని కాలనీ వాసులు చెబుతున్నారు. ఆ స్తంభం కూలితే పొలాలకు వెళ్లే మూగజీవాలు మృత్యువాతపడే అవకాశాలు ఉన్నాయి. అంతేకాక వ్యవసాయ కూలీలకు పొలాలకు వెళ్లే సమయాల్లో ప్రమాదం పొంచి ఉంది. అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా వారు స్పందించి స్తంభాన్ని మార్చాలని వారు కోరుతున్నారు.

ఎంఈవో-1గా మాల్యాద్రి బాధ్యతలు



ఎంపీడీవో శ్రీనివాసులుకు నియామక పత్రం అందచేస్తున్న ఎంఈవో-1 మాల్యాద్రి

లింగసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1గా కే. మాల్యాద్రి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కట్టా శ్రీనివాసులును కలిసిన ఆయన తన నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 ఎంవీ శివ కుమార్, హెచ్‌ఎం కే సూర్యప్రకాశరావు, పలువురు ఉపాధ్యాయులు మాల్యాద్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని, అందుకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ బాలకోటయ్య, తదితరులు

లింగసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు పూరిమిట్ల బాలకోటయ్య చెప్పారు.శుక్రవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ఫ్రెషర్స్‌డేను వార్డెన్ మాల్యాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సవిత్ర సోలార్ కంపెనీ ఎండీ అన్నంగి వెంకటరమేష్ అందచేసిన స్టీలు ప్లేట్లు, గ్లాసులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొట్టె వెంకయ్య, గ్రామపెద్ద కదిరి వెంకటయ్యనాయుడు, పరిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పుష్కరిణి పనులు



బిట్రగుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంటలో శ్రీవారి పుష్కరిణి పునఃనిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయి. స్థానిక టీడీపీ నేత విజయ్‌కుమార్ యాదవ్, రంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోనేటిలోని నీటితొలగింపు పూర్తైంది. ఈ నెల 10న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులచే శంకుస్థాపన కార్యక్రమం ఉండటంతో పనులు మరింత ఊపందుకున్నాయి.

చిరుజల్లులకే మడుగులు

● రోడ్డుపై నిలుస్తున్న నీరు... ప్రజల ఇక్కట్లు



కావలి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళ రావునగర్ బోర్డు సమీపంలో ఉన్న ఉదయగిరి రోడ్డుపై చిరుజల్లులు కురిసినా, రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో రాక పోకలకు వాహనచోదకులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. కావలి-ఉదయగిరి రోడ్డు ప్రస్తుతం నేషనల్ హైవేలో చేరింది. అక్కడ ఉన్న తారు రోడ్డుపై వర్షపునీరు పెద్దపెద్ద మడుగులుగా నిల్వ చేరింది. ఆ రోడ్డుపై పడిన వర్షపునీరు దక్షిణం వైపున ఉన్న కాలు వలోకి వెళ్లాల్సి ఉండగా, ఆ కాలువను ఆక్రమణదారులు పూర్తిగా మూసేశారు. దీనికితోడు రోడ్డు వెంబడి వెలసి న ఆక్రమణ దారులు తమ దుకాణాల ముందు ఎత్తుగా మట్టి తోలుకోవటంతో ఇక ఆ నీరు ఎటూ పోయేందుకు వీలు లేక అక్కడే నిలిచి పోతున్నాయి. ఇప్పటికైనా ము న్సిపల్ అధికారులు కానీ, నేషనల్ హైవే అధికారులు కానీ స్పందించి రోడ్డుపై నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలి.

కర్మక్రతువుల భవనం ప్రారంభం



కర్మక్రతువుల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కర్మక్రతువుల కోసం పాతూరు శివాలయం పక్క న నిర్మించిన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రారంభించారు. అ నంతరం ఆయన మాట్లాడుతూ అద్దె ఇళ్లలో ఉండే వ్యక్తులు చనిపోయినపుడు వారి మృతదేహాలను ఆ ఇళ్ల యజమానులు ఉంచటానికి అ భ్యంతరాలు చెబుతున్నారని తెలిపారు. దీంతో వారికి సరైన వసతిలేక పడుతున్న ఇబ్బందు లను తాను గుర్తించి భవనం నిర్మిస్తానని ఎన్ని కల్లో హామీ ఇచ్చానన్నారు. తాను తలచిన కా ర్యం శివుడి ఆజ్ఞతో నేడు నెరవేరిందన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణదాతలను, నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కమిటీ బాధ్యులు కేతిరెడ్డి బాలక్రిష్ణారెడ్డి, గిరిసాల శివ, జలదంకి రమణయ్య, డాక్టర్ మాధవరెడ్డి, హోమియో క్రిష్ణారెడ్డి, ఏ. రమేష్‌రెడ్డి నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వాలని సీఎంకు వినతి

కందుకూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఉండవల్లిలో సీఎం చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. కందుకూరు ఉత్తర బైపాస్‌రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.50 కోట్లు నిధులు విడుదల చేయాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే గుడ్లూరు మండలం చినలాటిరిపి వద్ద ఉద్యాన కళాశాలకు స్వంత భవనాల నిర్మాణానికి నిధులు, మండల కేంద్రాలైన వలేటివారిపాలెం, లింగసముద్రం గ్రామాల మధ్య డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబుకు విన్నవించారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమంలో నిధులు విడుదలకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

7వ వార్డులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కందుకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డులో స్థానిక టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌస్‌బాషా, రూబీ, ఖాదర్ బాషా, నాయబ్‌రసూల్, షేక్ చంటి తదితరులు పాల్గొన్నారు. 7వ వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేస్తున్న టీడీపీ నాయకులు

వాహనాలకు జరిమానాలు



మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగిస్తున్న ఎస్‌ఐ శివనాగరాజు

కందుకూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. మోడిఫైడ్ సైలెన్సర్లు, మోడిఫైడ్ నెంబరు ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలకు జరిమానాలు విధించారు. పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించటంతో పాటు అటువంటి సైలెన్సర్లు, నెంబరుప్లేట్లను తొలగించారు. సీఐ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో పట్టణంలోని పామూరుబస్టాండ్ సెంటర్‌లో ఉన్న శ్రీలక్ష్మీశ్రీనివాస కల్యాణమండపంలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటోడ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలు నడిపినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారంలో పరిశుభ్రమైన నీరు



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నవకిశోర్

లింగసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకం నుంచి వారంలో పరిశుభ్రమైన నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామని కందుకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నవకిషోర్ చెప్పారు.శుక్రవారం ఏఈ రాజశేఖర్‌తో కలిసి ఆయన గుడ్లూరు, రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకాలను, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు.ఈ ప్లాంటులోని మూడు ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు.వీటిలో రెండు బెడ్ల నుంచి మాత్రమే మంచినీరు ఫిల్టర్ అవుతోందని, ఒక ఫిల్టర్ బెడ్ నుంచి నీరు ఫిల్టర్ కావడం లేదన్నారు. ఈ ఫిల్టర్ బెడ్‌లోని చిన్నచిన్న రాయి లాంటి గ్రావెల్, ఇసుక తక్కువగా ఉందని, అలాగే ఈ బెడ్‌లోని పైపులు కూడా మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. వారంలో మరమ్మతు చేయించి, పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుపు తీగ

తిరుపతిలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మెరుపులతో ఆకాశం రంగురంగుల కాంతులతో అలరించింది.







వరములివ్వు వరలక్ష్మి

జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మహిళలు నోములు నోచారు.

తిరుచానూరులో వ్రత వేడుకలు

- 6లో



టీడీపీ సంస్థాగత ఎన్నికల సాగదీత

జిల్లాలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీల ఎన్నిక ప్రక్రియ సా...గుతోంది. పార్టీ మహానాడు జరిగి రెండు నెలలు దాటుతున్నా ఇంకా మండల, పట్టణ, నగర కమిటీల ఎన్నిక ముగియలేదు. పలుచోట్ల ఏకాభిప్రాయం కుదరడం లేదు. చాలాచోట్ల పోటీ తీవ్రంగా ఉంది. ఆశావహుల పేర్లు అధిష్ఠానానికి చేరాయి. కొన్ని చోట్ల ఒకే పేరు సిఫారసు చేసినా అధికారిక ప్రకటనలు వెలువడడం లేదు. పరిశీలకులు మొదలుకుని ఎమ్మెల్యేల దాకా సంస్థాగత ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడం లేదని శ్రేణులు అసంతృప్తితో ఉన్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి)

- మహానాడు జరిగి రెండు నెలలు దాటినా ముగియని ప్రక్రియ
- పలుచోట్ల కుదరని ఏకాభిప్రాయం
- తిరుపతి సహా సత్యవేడు, వెంకటగిరి, సూళ్లూరుపేటల్లో కమిటీలు పెండింగ్

తిరుపతి నగర కమిటీ ఎన్నికయ్యేది ఎప్పుడు?

తిరుపతి నియోజకవర్గం పూర్తిగా నగర ప్రాంతం. 50 డివిజన్లలోనూ దాదాపు అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక పూర్తయింది. నగర కమిటీ మాత్రం ఇంకా పెండింగులోనే ఉంది. జిల్లా కేంద్రం కావడంతో ఈ కమిటీ అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా బలిజ, యాదవ, కమ్మ సామాజికవర్గాల నుంచీ పలువురు ఈ పదవి ఆశిస్తున్నారు. మునిశేఖర్ రాయల్, ఆనంద్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు తదితరుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇన్‌ఛార్జి నియామకం కూడా ఇక్కడ పెండింగులో ఉండటం గమనార్హం. అధిష్ఠానం ముందు ఇన్‌ఛార్జిని నియమిస్తుందా లేదా నగర కమిటీని ప్రకటిస్తుందా అన్నది అంతుబట్టని పరిస్థితి. నియోజకవర్గ పరిశీలకుడు ఆలపాటి రాజా గత మంగళ, బుధవారాల్లో ఇక్కడే మకాం వేసి డివిజన్, క్లస్టర్ స్థాయి నేతలతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించి అధిష్ఠానానికి అందజేశారు. మరి ఏ నిర్ణయాన్ని.. ఎప్పుడు తీసుకుంటారో వేచి చూడాలి.

'పేట'లో పోటాపోటీ.. ఓజిలిలో నేతల బాహాబాహీ

జిల్లాలో ఎక్కడా లేనివిధంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో పదవులకు పోటీ తలెత్తింది. సూళ్ళూరుపేట మండల అధ్యక్ష పదవికి ఏకంగా ఏడుగురు పోటీ పడుతుండగా.. కార్యదర్శి పదవి కోసం ఐదుగురు ఆశపడుతున్నారు. పట్టణ అధ్యక్ష పదవికి ముగ్గురు, కార్యదర్శి పదవికి ఐదుగురు పోటీలో ఉన్నారు. పెళ్లకూరులోనూ అధ్యక్ష పదవికి ఏడుగరు, కార్యదర్శి పదవికి ముగ్గురు.. తడలో ఇద్దరు, ముగ్గురు.. దొరవారిసత్రంలో రెండింటికీ ముగ్గురేసి చొప్పున పోటీ పడుతున్నారు. నాయుడుపేట పట్టణ అధ్యక్ష పదవిని ఇద్దరు, కార్యదర్శి పదవిని నలుగురు కోరుతున్నారు. అక్కడే మండల అధ్యక్ష పదవికి ఇద్దరు, కార్యదర్శి పదవికి ముగ్గురు పోటీ పడుతున్నారు. ఓజిలిలో రెండు పదవులకూ నలుగురేసి చొప్పున ఆశిస్తున్నారు. ఏకాభిప్రాయ సాధన కోసం ఇటీవల జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ, పరిశీలకుడు శివప్రసాద్ సమక్షంలోనే మునుపటి నుంచీ వున్న నాయకులు, కొత్తగా వచ్చిన నాయకులు వర్గాలుగా విడిపోయి పరస్పరం ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. వ్యవహారం అధిష్ఠానం చెంతకు చేరింది.

వెంకటగిరి పేర్లు అధిష్ఠానానికి

వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి జిల్లా పరిధిలోని మూడు మండలాలకు గానూ వెంకటగిరి మండల అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ ఏర్పడింది. వెంకటగిరి పట్టణ కమిటీకి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు ఒక్కో పేరు మాత్రమే అధిష్ఠానానికి వెళ్లగా, వెంకటగిరి మండల అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడుతున్నారు. రాజీ కుదరకపోవడంతో వారం కిందట రెండు పేర్లూ అధిష్ఠానానికి పంపించారు. ఇంకా నిర్ణయం వెలువడలేదు.

సత్యవేడులో మొదలుకాని ప్రక్రియ

సత్యవేడు నియోజకవర్గంలో జూలై మొదటి వారంలో కూరపాటి శంకర్‌రెడ్డి సమన్వయకర్తగా నియమితులయ్యారు. అందువల్ల ఇక్కడ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదు. ప్రస్తుతానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించే తీరునుబట్టి పార్టీ కోసం కష్టపడేవారికే గ్రామ, మండల కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. దీంతో ఇక్కడ కమిటీల ఎన్నిక జరగడానికి మరికొంత కాలం పట్టొచ్చు. మండల పార్టీ అధ్యక్ష పదవులకు మాత్రం విపరీతమైన పోటీ ఉంది. సత్యవేడులో నలుగురు.. నాగలాపురంలో ఐదుగురు రేసులో ఉన్నారు. పిచ్చాటూరులో ఒక వర్గం నుంచి ముగ్గురు, మరో వర్గంలో ఇద్దరు, ఇంకో వర్గం నుంచి ఇద్దరు చొప్పున పోటీలో ఉన్నారు. బీఎన్ కండ్రిగ అధ్యక్ష పదవిని ఏకంగా ఏడుగురు ఆశిస్తుంటే, వరదయ్యపాలెంలో ఆరుగురు, కేవీబీపురంలో ముగ్గురు, నారాయణవనంలో ఇద్దరు పోటీ పడుతున్నారు.

జిల్లా, అనుబంధ సంఘాలెప్పుడు?

వాస్తవానికి గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకం పూర్తి చేశాకే రాష్ట్ర, జాతీయ అధ్యక్షుల ఎన్నిక మహానాడులో జరుగుతుంది. ఈ పర్యాయం సంస్థాగత ఎన్నికలు జరపకుండానే మే నెలలో మహానాడు జరిపారు. జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఎన్నికయ్యారు. మహానాడు ముగిశాక సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టినప్పటికీ రెండు నెలలు దాటుతున్నా గ్రామ, పట్టణ, నగర, మండల కమిటీలు పూర్తి కాకపోవడం శ్రేణుల్లో అసంతృప్తిని మిగుల్చుతోంది. నామినేటెడ్ పదవులు ఆశించి నిరాశకు లోనైన వారికి కనీసం పార్టీ పదవులైనా దక్కుతాయని భావిస్తుండగా ఆ ప్రక్రియ కూడా ఆలస్యమవుతుండడంతో నిస్పృహ చెందుతున్నాయి. వీటికే ఇంత ఆలస్యమైతే ఇక జిల్లా కమిటీ, అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటయ్యేది ఎప్పుడన్న ప్రశ్న శ్రేణుల నుంచి వినిపిస్తోంది.

ఆ నాలుగింట ఏకాభిప్రాయాలు

గూడూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి నియోజకవర్గాల్లో మండల, పట్టణ కమిటీల అధ్యక్ష పదవులకు దాదాపుగా ఏకాభిప్రాయాలు సాధ్యమయ్యాయి. అధ్యక్ష పదవులకు ఒక్కో పేరునే సూచిస్తూ నియోజకవర్గ నాయకత్వాలు అధిష్ఠానానికి పంపించాయి. అధికారికంగా పార్టీ నుంచి ప్రకటన వెలువడాల్సి వుంది.

మరో 13 ఆలయాల ట్రస్ట్‌బోర్డుల ఏర్పాటుకు నోటిఫికేషన్

తిరుపతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో 13 ఆలయాలకు పాలకమండళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ధార్మిక పరిషత్ నోటిఫికేషన్ జారీచేసింది. ఇప్పటికే వార్షికాదాయం రూ.కోటి నుంచి రూ. 5కోట్ల వరకున్న నాలుగు ప్రధాన ఆలయాలకు గురువారం నోటిఫికేషన్ జారీ అయిన సంగతి తెలిసిందే. తాజాగా చంద్రగిరి మూలస్థానం ఎల్లమ్మ, తొండవాడ అగస్త్యేశ్వరస్వామి, పాకాల మండలం ఊట్లవారిపల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, తలకోనలోని సిద్దేశ్వరస్వామి, వెంకటగిరి పోతురాజు పోలేరమ్మ ఆలయం, డక్కిలి మండలం దేవుడివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి, గూడూరు ధర్మరాజస్వామి ఆలయం, చిట్టమూరు మండలం మల్లం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వాకాడు మండలం పంట్రంగంలోని పాండురంగేశ్వరస్వామి, ఏర్పేడు మండలం గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి, నారాయణవనం మండలం కైలాసనాథస్వామి, నాయుడుపేట మండలం విన్నమాలలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, తిరుపతికి సంబంధించి వేశాలమ్మ ఆలయాలకు నోటిఫికేషన్ వచ్చింది. ఆసక్తి కలిగినవారు 20రోజుల్లోగా తమ దరఖాస్తులను జిల్లా దేవదాయశాఖ అధికారి ద్వారా పంపించాలి.



ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

- 24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- రెండు మోటరు సైకిళ్ల సీజ్

మంగళం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సత్యవేడు అటవీ పరిధిలోని జంబుకేశ్వరపురంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 24 ఎర్రచందనం దుంగలు, రెండు మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం గురువారం సత్యవేడు అటవీ పరిధిలో స్థానిక ఎఫ్‌బీవో వేణుగోపాల్‌తో కలిసి కూంబింగ్ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున జంబుకేశ్వర పురం నీలగిరితోటకు చేరుకోగా అక్కడ రెండు మోటారు సైకిళ్లతో కొందరు వ్యక్తులు కనిపించారు. చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారిలో కొందరు పారిపోయారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. సమీపంలో దాచిన 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒకరు తిరుపతి జిల్లా, మరో ఇద్దరు తమిళనాడుకు చెందిన వారు. దుంగలు, మోటరు సైకిళ్లతో కలిపి నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించి ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

జనసేన మాజీ ఇన్‌చార్జి వినుతకు షరతులతో కూడిన బెయిల్

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : డ్రైవరు కమ్ పీఏ హత్య కేసులో శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌చార్జి కోట వినుతకు బెయిల్ మంజూరైంది.గత నెల 7వ తేదీన డ్రైవరు రాయుడు అలియాస్ శ్రీనివాస్‌ను చంపి మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి చెన్నై సమీపంలోని కువ్వా నది కాలువలో పడవేసినట్లు వినుత, ఆమె భర్త చంద్రబాబు సహా మరో ముగ్గురిపై చెన్నై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ కేసులో వినుతకు చెన్నై కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.రోజూ ఉదయం 10గంటల్లోపు చెన్నైలోని సెవెన్‌హిల్స్ పోలీసు స్టేషన్‌లో సంతకం చేయాలని కోర్టు షరతు విధించింది.

చిత్తూరులో పవన్

- లాడ్జీలో బంధించిన నిందితులు
- విడిపించి తిరుపతికి తీసుకొచ్చిన పోలీసులు
- వైసీపీ గ్యాంగ్ దాడి ఘటనపై విభిన్న కోణాల్లో విచారణ


పవన్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో భూమన అభినయ్ అనుచరుల చేతిలో తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్ ఆచూకీ శుక్రవారం లభ్యమైంది. చిత్తూరులోని ఓ లాడ్జీలో బంధించినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని విడిపించి తిరుపతికి తీసుకొచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. రెంటల్ బైక్ తీసుకుని అద్దె చెల్లించలేదంటూ వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేతలు దినేష్, జగదీశ్వరరెడ్డి, అజయ్‌కుమార్ తదితరులు బుధవారం మధ్యాహ్నం దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం.. పోలీసులు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ దాడిలో బాధితుడు పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన పవన్‌కుమార్ బుధవారం రాత్రి తప్పించుకుని వెళ్లారు. దినేష్‌తో పాటు పవన్‌కూ కల్లూరు మండలం ఇస్రాకులపల్లికి చెందిన జానకిరాం స్నేహితుడు. వీరి నుంచి తప్పించుకెళ్లిన పవన్ చిత్తూరు బస్సు ఎక్కగా.. జానకిరాం కూడా అదే బస్సులో కలిసి చిత్తూరుకు బయలుదేరారు. అదే సమయంలో పోలీసు రంగంలోకి దిగడం, తమపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదవడంతో నిందితుల్లో ఒకడైన దినేష్ స్పందించాడు. పవన్‌కుమార్‌ను దాచి ఉంచాలని జానకిరామ్‌కు చెప్పాడు. చిత్తూరులో వీరిని రాజు (చిత్తూరుకు చెందిన ఇతడు తిరుపతిలో ప్లాట్ల వ్యాపారం చేస్తూ, వైసీపీ గ్యాంగ్‌తో చేతులు కలిపి ఫైనాన్సు చేస్తున్నాడు) కలిశాడు. కట్టమంచి సమీపం, ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే దారిలోని ఓ లాడ్జిలో గది తీసుకుని పవన్‌ను అందులో బంధించారు. అతడితో పాటు జానకిరాంను ఉంచారు. కేసు నుంచి తప్పించుకునేలా, దళిత సంఘాల ఆందోళనలు తీవ్రం కాకుండా ఉండేలా దినేష్ కథ నడిపాడు. అందులో భాగంగా 'నన్ను ఎవరూ ఏమీ చేయలేదు. మా అన్న దినేష్ చిత్రహింసలు పెట్టి కొట్టాడంటూ దళితులు ఆందోళన చేసి నన్ను ఇబ్బంది పెట్టాల్సిన పని లేదు' అంటూ జానకిరాం, రాజు కలిసి పవన్ చేత చెప్పించి ఆ వీడియో రిలీజ్ చేశారు.


అనిల్‌ను వైద్య పరీక్షలకు రుయాస్పత్రికి తీసుకెళుతున్న పోలీసులు

ముగ్గురి అరెస్టు : ఈ కేసులోని నలుగురు నిందితుల్లో అనిల్‌కుమార్‌రెడ్డి, దినేష్, జగదీశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండుకు పంపారు. అజయ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. రిమాండ్‌లోని ముగ్గురు నిందితులను మళ్లీ కస్టడీకి తీసుకుని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ ముగ్గురితో పాటు రాజు, జానకిరాం, మరో ఐదుగురి పేర్లు చార్జిషీటులో చేర్చనున్నట్లు తెలిసింది. వీరందరిపై రౌడీషీట్లు ఓపెన్ చేయడానికి పోలీసులు సన్నద్ధమవుతున్నారు.

ఆందోళన.. సుఖాంతం

రెండు రోజులుగా పవన్ కనిపించకుండా పోవడం.. సెల్‌ఫోను ఆఫ్.. ఆన్ చేస్తుండటం పోలీసులను, తల్లి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసింది. ఇతడి ఆచూకీ కోసం ఎస్పీ హర్షవర్ధన రాజు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఇద్దరు సీఐలు ముమ్మరంగా గాలించారు. జానకిరామ్ ఫోను నెంబరు ట్రేస్ చేసి చిత్తూరులో ఉన్నట్లు శుక్రవారం గుర్తించారు. అలా లాడ్జీలో ఉన్న పవన్, జానకిరాంను పట్టుకుని తిరుపతి పోలీసులకు అప్పగించారు. ఈ వీడియో తనను చంపేస్తామని బెదిరించి మాట్లాడించారని ఈ సందర్భంగా పోలీసులకు పవన్ వాగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఈ కేసును వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ డివిజన్లకు త్వరలో ఎన్నికలు

తిరుపతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న మూడు డివిజన్లకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలుపెట్టింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థ పరిధిలో 4, 7, 24 డివిజన్లలో ఎన్నికలు జరగాల్సి ఉంది. నాలుగో డివిజన్‌కు ప్రాతినిధ్యం వహించిన మాజీ డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి గతేడాది సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాజీనామా చేశారు. అదేవిధంగా 24వ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నాయక్ ఏడాదిన్న కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఇక 7వ డివిజన్ కు మున్సిపల్ ఎన్నికల సమయంలో ఫోర్జరీ వివాదంతో కోర్టుకు ఎక్కడంతో ఎన్నికలు నిలిపివేశారు. ఈ మూడు డివిజన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమవడంతో ఆశావహుల్లో ఆశలు పుట్టాయి. అలాగే, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించి 16, 19 వార్డులకూ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గూడూరు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం గూడూరు ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పోలీ సుల వివరాల మేరకు.. స్థానిక మాయాబజారుకు ప్రాంతానికి చెందిన హనుమంతు, గమళ్లపాళెం ప్రాంతానికి చెందిన గణేష్ 600 గ్రాముల గంజాయి చిన్న ప్యాకెట్లతో రైల్వేస్టేషన్ తూర్పు వైపున ఉన్న పాడుపడిన క్వార్టర్స్ వద్ద వద్ద ఉండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నిషేధిత మత్తు పదార్థాలను స్థానిక ఆస్పత్రి రోడ్డులోని రెండు దుకాణాల మధ్య సన్నని సందులో దాచిపెట్టి, అదే ప్రాంతానికి చెందిన నయాం అనే వ్యక్తి సాయంతో విక్రయాలు సాగిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.


శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,234

తలనీలాలు సమర్పించినవారు: 26,133



సుస్థిర ప్రగతి దిశగా శ్రీసిటీ

● ఎండీ రవీంద్ర సన్నారెడ్డి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

సత్యవేడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పదిహేడేళ్ల ప్రస్థానంలో ప్రపంచ తయారీ గమ్యస్థానంగా శ్రీసిటీ మారడం ఎంతో సంతోషంగా ఉందని ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. శ్రీసిటీ ఏర్పడి 17 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇక్కడి బిజినెస్ సెంటర్‌లో తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలు, ఉపాధితో పాటు సామాజిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహక పారిశ్రామిక విధానాలు, సహకారంతో భవిష్యత్తులో శ్రీసిటీ సుస్థిర ప్రగతి దిశగా మరింత వేగంగా ముందుకు సాగనుందని తెలిపారు. శ్రీసిటీలోని పలు పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

తిరుపతి, రేణిగుంటలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

● బేకరీలు, స్వీట్ షాపుల్లో శ్యాంపుల్స్ సేకరణ

● ఒక బేకరీ సీజ్.. మరోదానికి నోటీసులు



తిరుపతిలోని బేకరీలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు శుక్రవారం వివిధ బేకరీలు, స్వీట్ షాపులపై తనిఖీలు చేశారు. వీరితో పాటు తూనికలు, కొలతల శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పాడైన స్వీట్లు, తినుబండారాలను ధ్వంసం చేశారు. రేణిగుంలోని ఎఫ్ఎస్ఎస్ఐ నిబంధనలు ఉల్లంఘించి పరిశుభ్రత పాటించని ఎపీ్ప ఫుడ్ బేకరీని సీజ్ చేశారు. టూటీ ఫ్రూటీ తయారు చేసే దుకాణంలో పరిశుభ్రత, వినియోగదారులకు సౌకర్యాలు లేకపోవడంతో యజమానికి నోటీసులు జారీ చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో 17 బృందాలుగా ఏర్పడి 35 బేకరీలు, స్వీట్ షాపులపై అధికారులు తనిఖీలు జరిపారు. 31 ఆహార పదార్థాలను శ్యాంపుల్స్‌గా సేకరించి ల్యాబ్‌కు పంపారు. దాదాపు 75 కిలోల కాలం చెల్లిన స్వీట్లు, తినుబండారాలను సీజ్ చేసి ధ్వంసం చేసినట్లు రాష్ట్ర ఫుడ్ కంట్రోల్ జాయింట్ కమిషనరు పూర్ణచంద్రరావు చెప్పారు. ఈ తనిఖీల్లో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి, సిబ్బంది జగదీష్, సుమన్, దాదాపు 25 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో హైకోర్టు న్యాయమూర్తులు





జస్టిస్ ప్రవీణ్ కుమార్ - జస్టిస్ మాల

తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ ప్రవీణ్ కుమార్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ మాల శుక్రవారం ఉదయం శ్రీవారిని వేర్వేరుగా దర్శించుకున్నారు.ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.వీరికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాల ప్రకారమే..

ఇకపై సరుకుల కొనుగోలు

- టీటీడీ నిర్ణయం -

తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): ఇకపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నియమావళి ప్రకారమే టీటీడీ మార్కెట్ విభాగం 52 ఆహార వస్తువులు కొనుగోలు చేయనుంది. టెండర్లలో ఎలాంటి మినహాయింపులూ లేకుండా కొనుగోళ్లు జరగాలని టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేయనుంది. గత ప్రభుత్వంలో టీటీడీ అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల నాణ్యత, రుచి తగ్గాయంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మారిన తర్వాత వీటి రుచిని పెంచేందుకు టీటీడీ ఫోకస్ పెట్టింది. ఈవో శ్యామలరావు బృందం తొలుత కల్తీ నెయ్యిని గుర్తించి సరఫరా చేసే కొన్ని సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. గతంలో నిలిపివేసిన నందిని నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అలాగే ప్రసాదాలు, అన్నప్రసాదాలు, లడ్డూ వంటి వాటిలో వినియోగించే ఆహార వస్తువుల కొనుగోలు ప్రక్రియ గత ప్రభుత్వంలో గతి తప్పినట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలు ఉన్నప్పటికీ టీటీడీ ప్రొక్యూర్మెంట్ విధానంలోని స్టాండర్డ్స్ సక్రమంగా లేనట్టు తేలింది. ఈ క్రమంలోనే కొనుగోళ్లలో పారదర్శకత, నాణ్యత పెంపు కోసం రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ నిపుణుల సేవలను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకోవాలని గతేడాది నవంబరులో నిర్ణయించారు.

టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ద్వారా..

నిపుణుల సూచనలను పరిశీలించేందుకు టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్‌టీ డైరెక్టర్ ఆనంద రామకృష్ణన్, ప్రభుత్వ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, మైసూరు సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఉషారాణిని నియమించారు. ఈ కమిటీ 52 ఆహార వస్తువుల స్పెసిఫికేషన్లను ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా సవరించి నివేదిక సమర్పించింది. దీని ఆధారంగానే ఇకపై టెండర్ల ద్వారా కొనుగోలు చేయాలని సూచించింది. నెయ్యి కొనుగోలులోనూ సెన్సరీ పారామీటర్లు చేర్చాలని, ఎన్ఏబీఎల్ అక్రిడిటెడ్ ల్యాబ్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే సూచనలు చేసింది. దీని ప్రకారమే ఇకపై ఆహార వస్తువులను కొనుగోలు చేయాలని టీటీడీ అధికారులు గత నెలలో నిర్ణయించారు.

అమ్మవారి ఆలయంలో

శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం

● కన్నుల పండువగా స్వర్ణ రథోత్సవం





స్వర్ణరథంపై ఊరేగుతున్న అమ్మవారు





టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరికి కంకణధారణ చేస్తున్న వేదపండితులు

తిరుచానూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థానమండపంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపుచేసి పద్మపీఠంపై కొలువు దీర్చి పూజాక్రతువులు నిర్వహించారు. అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపెంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూల, వృక్షి వంటి సంప్రదాయ పుష్పాలతో అర్చించారు. తొమ్మిది గ్రంధులతో(నూలుపోగులు) అలంకరించారు. వరలక్ష్మి పూజావిధానం, వ్రత మహాత్మ్యాన్ని అర్చకుడు శ్రీనివాసాచార్యులు భక్తులకు వివరించారు. 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించాక మహామంగళ హారతితో వరలక్ష్మీ వ్రతం ముగిసింది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఏపీ, తెలంగాణలోని 52 టీటీడీ ఆలయాల్లో సౌభాగ్యం పేరిట 8లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపుదారాలు, 1.60 లక్షల కుంకుమ ప్యాకెట్లు, లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, వీజీవోలు సురేంద్ర, రాంకుమార్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాదు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్రత మండపం

టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటుచేసిన వ్రత మండపం భక్తులను ఆకట్టుకుంది. 40మంది సిబ్బంది, 3 టన్నుల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల 30వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరించారు.



స్వర్ణరథంపై అమ్మవారి అభయం

పద్మావతి ఉత్సవమూర్తిని శ్రీమహాలక్ష్మి అలంకారంలో స్వర్ణరథంపై కొలువుదీర్చారు. సాయంత్రం 6గంటలకు భక్తుల గోవిందనామ స్మరణల నడుమ తిరుమాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథం లాగడానికి మహిళా భక్తులు పోటీ పడ్డారు. వ్రతం సందర్భంగా అమ్మవారి మూలవర్లను బంగారు చీరతో అలంకరించారు. వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభమైంది. గేటు నెంబరు 4గుండా భక్తులను అనుమతించారు. క్యూలైన్లలో రద్దీ. ఎండ వేడిమికి భక్తులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సర్వదర్శనం గంటన్నరకుపైగా పట్టింది.



వాహనసేవ ముందు కళా బృందాల ప్రదర్శన

రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే సహించం

● ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే తీవ్ర ఉద్యమానికి శ్రీకారం ● ప్రజా సంఘాల ఐక్య వేదిక అఖిల పక్ష సమావేశంలో నేతల స్పష్టం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే ప్రశాంతమైన తిరుపతిలో ప్రజలెవ్వరూ సహించరని ప్రజా సంఘాల ఐక్య వేదిక అఖిల పక్ష సమావేశంలో నేతలు స్పష్టం చేశారు. తిరుపతిలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్, ఆర్పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత యువకుడు నీలం పవన్ కుమార్ కిడ్నాప్, దాడి దుర్మార్గమైనదని అన్నారు. ఆర్థిక లావాదేవీలుంటే పోలీసులు, కోర్టులు ఉన్నాయన్నారు. రాజకీయ అండ చూసుకుని చిత్రహింసలు పెట్టడం ఆవేదనకు గురి చేసిందన్నారు. తిరుపతి వంటి ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంలో రౌడీలు, గుండాలకు చోటివ్వకూడదన్నారు. ఇంతటి తీవ్ర దుర్మార్గానికి పాల్పడిన వారిని తిరుపతి నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన బయటికి వచ్చింది, రానివి ఇంకెన్ని జరిగాయో తేల్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. నిందితులను అరెస్టు చేస్తే పోలీసు స్టేషన్ వద్ద అందోళన చేయడం ఏమిటని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్మార్గాలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండు చేశారు. పోలీసులు డ్రోన్లను నేర చరిత్ర గల రాజకీయ నేతల చుట్టూ తిప్పాలన్నారు. తిరుపతి ప్రశాంతతను కాపాడేందుకు రౌడీలు, నేరస్తులు భయపడే పరిస్థితి తీసుకురావాలని పోలీసులను సీపీఐ (ఎంఎల్) నేత వెంకటరత్నం కోరారు. 'ఈ దాడికి పాల్పడిన వారి నేర చరిత్రను పూర్తిగా పరిశీలించాలి. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మనుషులే ఈ దాడికి పాల్పడ్డారనే ఆరోపణ వస్తోంది. దీనిపై భూమన స్పందించకపోవడం మరింత బలం చేకూరుస్తోంది' అని కాంగ్రెస్ నేత దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో రౌడీలు, గుండాలకు తావులేకుండా చేయడానికి, ఇలాంటి దారుణాలను కట్టడి చేయడానికి ప్రభుత్వానికి, పోలీసులకు ప్రజల అండ అవసరమని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. తమిళనాడు తరహాలో దళితులు ఒక కమిటీగా ఏర్పడి ప్రతిఘటనకు సిద్ధపడకుంటే మరిన్ని దారుణ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే సురాజ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ నాయకుడు మధు, కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) నేత శ్రీనివాసులు, లాయర్స్ అసోసియేషన్ నేత చల్లా వెంకటయ్య, కాంగ్రెస్ నగర కార్యదర్శి యార్ల గోపి, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడికొండ ప్రసాదరావు, అంబేడ్కర్ ఆర్మీ నేత గోపి, సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, టీడీపీ నేత ఆముదాల తులసీరాం, ఏఎన్ పరమేశ్వరరావు, దళిత మహాసభ నేత ప్రభాకర్, మైనారిటీ సంఘ నాయకులు అమీర్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ) జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, వీసీకే నేత రమేష్, పలు ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

తీర్మానాలు

- పవన్‌కూ, బాధిత కుటుంబానికి అండగా నిలవాలి. తిరుపతిలో రాష్ట్ర సదస్సు చేపట్టి, అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులను తీసుకురావాలి.
- నిరుపేద దళిత యువకుడి కుటుంబాన్ని జగన్మోహన్ రెడ్డి ఓదార్చాలి.
- తిరుపతిలో రౌడీయిజాన్ని రూపుమాపడానికి అందరూ ముందుకు రావాలి.

మొక్కు తీర్చుకున్న పట్టాభి

● కాలినడకన తిరుమలకు

తిరుపతి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మొక్కు తీర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాలినడక తిరుమలకు వస్తానని మొక్కుకున్నారు. ఆ మేరకు శుక్రవారం కుటుంబ సమేతంగా అలిపిరి పాదాల మండపం నుంచి తిరుమలకు వెళ్లారు. జగనాసుర కబంధ హస్తాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కలిగించి, కూటమి అధికారంలోకి రావాలని శ్రీవారిని వేడుకున్నానని ఈ సందర్భంగా పట్టాభి చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా కాలినడకన తిరుమలకు వెళుతున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపం వద్ద టీడీపీ నాయకులు వారికి స్వాగతం పలికారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు,కరాటే చంద్ర. ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్, పాటకం వెంకటేష్, జిమ్ ప్రకాష్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



అలిపిరి పాదాల మండపం వద్ద స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

తిరుమల ఘాట్‌రోడ్డులో జింక పిల్ల మృతి



తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో శుక్రవారం ఓ జింక పిల్ల మృతి చెందింది. మార్గంలోని చివరి మలుపు వద్ద ఎలాంటి కదలికలు లేకుండా పడిఉన్న ఆరు నెలల వయసున్న జింకను చూసిన కొంతమంది వాహనదారులు విజిలెన్స్, అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీ అధికారులు జింకను పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో వాహనం ఢీకొనలేదని, కొండ పైభాగం నుంచి కిందపడి మృతి చెంది ఉండవచ్చని తెలియజేశారు.



కె.శ్రీనివాస్‌కు కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కార ప్రదానం

అమ్మను మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరు

సామాజిక సాహిత్య విశ్లేషకులు కె.శ్రీనివాస్

పలమనేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):అమ్మను మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరని ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు,సామాజిక సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.పలమనేరులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన సాహితీ సభలో ఆయనకు కేఎన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని రచయిత పలమనేరు బాలాజి అందజేశారు.ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జయమ్మ కుమారుడిగా పలమనేరు బాలాజి ఏకలవ్య కాలనీ ఎరుకల కథల్లో తన తల్లి ఔన్నత్యాన్ని అక్షరీకరించి,ఆమెను చిరంజీవిగా నిలిపారన్నారు.తల్లిదండ్రులు మరణించినా వారి పేరున చేసే ఇటువంటి కార్యక్రమాలు వారిని సజీవంగా వుండేట్లు చేస్తాయన్నారు.ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్, రచయిత ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆధిపత్య భావజాలాన్ని,దోపిడీ విధానాల్ని,సామాజిక అసమానతల్ని తన రచనల ద్వారా శ్రీనివాస్ ఎండగట్టారని ప్రశంసించారు.రచయితలు జి.వెంకట కృష్ణ, సుంకోజి దేవేంద్రాచారి,రాఘవ శర్మ, సహదేవనాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం,నెమిలేటి కిట్టన్న , బాబ్జీ, కొత్తపల్లి సురేష్, టీఎస్ఏ కృష్ణమూర్తి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, పల్లిపట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయొద్దు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం వెంటనే ఆపాలని వామపక్ష నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బజారువీధిలో వామపక్షాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వలన విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం విద్యుత్‌ను వాడుకుని తరువాత బిల్లులు చెల్లిస్తున్నారని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే ముందుగానే నగదు చెల్లించి కరెంటు వినియోగించుకోవాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో శివకుమార్, చంద్రయ్య, ప్రసాద్, మధు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ రాజేశ్వరికి నేతల నివాళి



రాజేశ్వరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నెల్లూరు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

డక్కిలి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన డక్కిలి జడ్పీటీసీ కలిమలి రాజేశ్వరి అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన చాపలపల్లిలో శుక్రవారం జరిగాయి. రాజేశ్వరి మృతదేహానికి నెల్లూరు జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాలకు చెందిన పలువురు నాయకులు రాజేశ్వరి మృతదేహానికి నివాళులర్పించారు. రాజేశ్వరి భర్త కలిమిలి రాంప్రసాద్ రెడ్డిని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

ప్రతి గడపకూ సంక్షేమం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బిందురెడ్డి తదితరులు

కోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ విస్తరింపచేయాలని, ఇందులో నాయకులు, కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బిందురెడ్డి అన్నారు. కోటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. బిందురెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 12న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తిరుపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ సారంగం రమేష్ బాబు, సురేష్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహంలో ఫ్రెషర్స్ డే



విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

కోట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కోటలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో శుక్రవారం రాత్రి ఫ్రెషర్స్ డే వేడుకలను ఎస్‌ఐ పవన్‌కుమార్ ప్రారంభించారు. 5నుంచి 10 తరగతుల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఆటపాటలతో సంబరాలు చేశారు. ఆటలు, పాటల్లో గెలుపొందిన విజేతలకు ఎస్‌ఐ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి అధికారులు, వార్డెన్ గజేంద్ర, సిబ్బంది సహపంక్తి భోజనాలు చేశారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

వెంకటగిరి, ఆగస్టు 8: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని స్థానిక మహాత్మగాంధీ గ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయాధికారి లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

పెదపాలెప్పమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని సప్తగిరికట్ట కాలనీ వద్ద వెలసిన పెదపాలెప్పమ్మ ఆలయంలో పొంగళ్ల మహోత్సవం నిర్వహించారు. పెదపాలెప్పమ్మ మాల ధరించిన భక్తులు ఇరుముడిని కట్టుకొని పట్టణంలోని ప్రధాన ఆలయాలను దర్శించుకుంటూ నగరోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పెదపాలెప్పమ్మ ఆలయానికి చేరుకున్నారు.



పెదపాలెప్పమ్మ భక్తులు ఇరుముడితో నగరోత్సవం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీప సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, వనంతోపు, పరమేశ్వరినగర్, గాండ్లవీధి, పార్కువీధి, బాపూజీ, కచ్చేరి వీధుల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మోహిని తెలిపారు. అదే విధంగా మన్నెముత్తేరి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రైల్వేగేటు అవతలివైపు ప్రాంతాలైన ఇసుక మిట్ట, ప్రభుత్వాస్పత్రి రోడ్డు, రాజీవ్ నగర్, షార్ బస్టాండు, రాఘవయ్యపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లోని మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర శుక్రవారం తెలిపారు.

నాయుడుపేట: పట్టణంలోని లోతువానిగుంట, ఎల్‌ఏసాగరం, బీడీ కాలనీ, భూపయ్యకాలనీ, అగ్రహారపేట, పిచ్చిరెడ్డితోపు, అమరాగార్డెన్, టీచర్స్‌కాలనీ, చంద్రమౌళినగర్, బాలాజీగార్డెన్, గాంధీమందిరం ఏరియా, జైహింద్‌కాలనీ, పొగగొట్టంకాలనీ, గెరిడీవీధి, కోళ్లఫారం, శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు, రాజగోపాలపురం, శ్రీరామ్‌నగర్, విన్నమాల గేట్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శివశంకర్ తెలిపారు.

కాళంగిపై కొత్త వంతెనకు మోక్షమెప్పుడో?

- శిథిలావస్థకు చేరిన బ్రిటీష్ కాలంనాటి బ్రిడ్జి
- 20 ఏళ్లుగా ప్రతిపాదనలతో సరి



శిథిలావస్థకు చేరిన కాళంగి వంతెన

సూళ్లూరుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నాటి వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనపై ప్రయాణం భద్రతకు ప్రశ్నార్థకరంగా మారింది. సూళ్లూరుపేటలోని ప్రధాన రహదారి జీఎన్‌టీ రోడ్డులో చెంగాళమ్మ ఆలయ సమీపంలోని కాళంగి నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రయాణం ప్రమాదంగా మారింది. 2004 నుంచి పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేదు. వంతెన కిందభాగంలో అక్కడక్కడ పగుళ్లు రావడంతో ప్రమాదకరంగా ఉంది. సూళ్లూరుపేట నుంచి చెన్నైకి వెళ్లేందుకు ఇది ప్రధాన రహదారి కావడంతో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు సూళ్లూరుపేట పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ఇక్కడ నుంచి శ్రీసిటీ, అపాచి, మేనకూరులో ప్రాంతాల్లో వెలసిన పరిశ్రమలకు వందలాది వాహనాలు వెళ్తున్నాయి. శిథిలావస్థకు చేరిన వంతెనపై భారీ వాహనాలు వెళ్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కొత్త వంతెన నిర్మించేందుకు 2004లో అప్పటి ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం హయాంలో రూ.3 కోట్లు మంజూరైనట్లు ప్రకటించారే తప్ప ఆచరణ లేదు. అదే విధంగా 2017లో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపారు కానీ కదలికలేదు. గత వైసీపీ పాలన చివరిలో 2023 నవంబరులో అప్పటి సీఎం జగన్ తడ మండల పర్యటన నేపథ్యంలో రూ.35 కోట్లతో కాళంగి నదిపై వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా ఆ కార్యక్రమం రద్దు అయ్యింది. మళ్లీ కాళంగి వంతెన కథ మొదటికి వచ్చింది. వంతెన బాగా బలహీనపడడంతో కొన్ని రోజులు భారీ వాహనాలు, కంపెనీలకు వెళ్లే బస్సులు బ్రిడ్జిపై వెళ్లకుండా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. కానీ కంపెనీలకు వెళ్లే బస్సులు, భారీ వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. 2007లో ఈ వంతెన ఓ వైపు కూలిపోయి ప్రమాదకర స్థాయికి చేరడంతో దాదాపు ఆరు నెలల పాటు రాకపోకలు నిలిపివేశారు. అనంతరం తాత్కాలికంగా మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలు పునఃప్రారంభించారు. జూలైలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఇందిరానగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కాళంగి వంతెనను పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన బ్రిడ్జి నిర్మాణానికి చొరవ తీసుకుంటామన్నారు. ఈ మేరకు అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు వరం: కురుగొండ్ల



ప్రజారోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళకు వరమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రజారోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఆగస్టు 15నుంచి ఉచిత బస్సు ప్రయాణం మొదలు కానుండడంతో మహిళల్లో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు. గత టీడీపీ పాలనలో ఎంతో అభివృద్ధి చేశామని, కానీ చేసిన పని చెప్పుకోవడంలో వెనకబడటం వల్లే 2019లో ఓడిపోవాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం గతంలో కంటే మిన్నగా అభివృద్ధి చేస్తున్నామని, చేసిన పనులను ప్రజలకు తెలియజేయడానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలతో మమేకం అయితేనే సమస్యలు తెలుసుకుని పరిష్కరించగలుగుతామన్నారు. డక్కిలి ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత గురించి వైద్యాధికారి బిందుప్రియ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వైద్య సిబ్బందిని నియమించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్‌ఐ శివశంకర్, ఎంఈవో జగదీష్ బాబు, పెనుశిల కోన ఆలయ చైర్మన్ తిరుపాల్ రెడ్డి, మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి అధ్యక్షుడు చంద్రారెడ్డి, రంగినేని రాజా, పచ్చూరి నరసయ్య నాయుడు, మురళి, దండవోలు పెంచలరెడ్డి, సునీల్‌రెడ్డి, పిల్లి శ్రీనివాసులురెడ్డి, జనసేన నేత సాయి పాల్గొన్నారు.

నేడు, ఎల్లుండి పలు రైళ్ల రద్దు

తడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలో పొన్నేరి - కవరోపేట రైల్వే స్టేషన్ల మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శనివారం, సోమవారాల్లో ఉదయం 11.10 నిమిషాల నుంచి మధ్యాహ్నం 3.10 నిమిషాల వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దు అయిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.40 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05కు వెళ్లే ఈఎంయూ, మెమూ రైళ్లు
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9.00కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 10.30, 11.35కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు
- చెన్నై బీచ్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు
- గుమ్మిడిపూడి నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 10.55కు వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఆవడికి రాత్రి 11.40కు వెళ్లే మెమూ రైలు
- చెంగల్‌పట్టు నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.55 నిమిషాలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లను చెన్నై బీచ్ వరకు నడపనున్నారు.
- గుమ్మిడిపూడి నుంచి తాంబ్రంకు మధ్యాహ్నం 3.00కు బయలుదేరి వెళ్లే ఈఎంయు లోకల్ రైళ్లను చెన్నై బీచ్ నుంచి తాంబ్రం వరకు నడపనున్నారు.

చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్, పొన్నేరి, మీజూరు మధ్య నడపనున్న ప్రత్యేక రైళ్ల వివరాలు...

- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరికి ఉదయం 10.30
- చెన్నై మోర్ మార్కెట్ నుంచి మీజూరుకు 11.35
- చెన్నై బీచ్ నుంచి పొన్నేరికి మధ్యాహ్నం 12.40
- పొన్నేరి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.18, 3.33
- మీజూరు నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 2.59 నిమిషాలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నారు.

ముళ్లచెట్ల తొలగింపు

చిల్లకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు మిక్సిడ్ కాలనీలో శుక్రవారం స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ముళ్లచెట్లను తొలగించి కాలనీ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కాలనీవాసులు పలు సమస్యలను టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రధానంగా ఇళ్ల మధ్యలో ముళ్లచెట్లు పెరిగిపోయి భయానకంగా ఉండంతో వాటిని తొలగించాలని తెలిపారు. దీంతో కాలనీలోని ఇళ్ల మధ్య ఉన్న ముళ్లచెట్లను తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పీఏసీఎస్ చైర్మన్ కొండా రామచంద్రారెడ్డి, రవి, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అనుమతిలేని ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకోండి

నాయుడుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా సూచించారు. ఇందుకోసం అక్టోబరు 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

టీడీపీ నేతకు పాశిం నివాళి



రమణయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాశిం

కోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దాలిలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకాణి రమణయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, చిట్టేడు సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు జలీల్ అహ్మద్, నాగూరయ్య, వేణు, చంద్రయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: డ్రైఫ్రూట్స్ అలంకరణలో గంగమ్మ, చిల్లకూరు: బంగారు చీరలో ముత్యాలమ్మ, ప్రత్యేక అలంకరణలో ఆదిలక్ష్మి, నాయుడుపేట: గాజుల అలంకరణలో పోలేరమ్మ, కోట: కోటమ్మ, వెండిచీరలో కన్యకాపరమేశ్వరి

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు

గూడూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీదేవి వ్రత పూజలు నిర్వహించారు. స్థానిక గంగమ్మ ఆలయంలో అమ్మవారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించి పూజలు జరిపారు. రాజరాజేశ్వరిదేవి, కన్యకాపరమేశ్వరిదేవి, నారాయణమ్మ ఆలయాల్లో అమ్మవార్లను విశిష్టరీతిలో అలంకరించి పూజలు చేశారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో వరలక్ష్మీదేవిని పూలతో అలంకరించి వరలక్ష్మీ వ్రతపూజలను జరిపారు.

చిల్లకూరు: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని బంగారు చీరతో అలంకరించి పూజలు జరిపారు. మహిళలు ఆలయంలో వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకారంలో ఉంచి విశేష పూజలు జరిపారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పండుగను పురస్కరించుకొని పోలేరమ్మను 25వేల డజన్ల గాజులతో అలంకరించారు. అలాగే తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం పూజలు నిర్వహించారు. పోలేరమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు నానాబాల సుబ్బారావు, టీటీడీ ఇన్‌స్పెక్టర్ హరి తదితరులు పాల్గొన్నారు.

తడ: చిన్నమాంబట్టులోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈకార్యక్రమాలకు దేవేంద్రరెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

కోట: గ్రామదేవత కోటమ్మకు అభిషేకాలు చేసి గాజులతో అలంకరించారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దాతృత్వంతో అన్నదానం జరిగింది. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీవ్రత పూజలు జరిగాయి. అమ్మవారిని ఆర్యవైశ్య సంఘ నాయకులు వెండి చీరతో అలంకరించారు.



గూడూరులోని నారాయణమ్మ ఆలయం, చిల్లకూరులోని ముత్యాలమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రత పూజలు చేస్తున్న మహిళలు

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

చిల్లకూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన జాకీర్‌పై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మోమిడి గ్రామానికి చెందిన జాకీర్‌తో అదే గ్రామానికి చెందిన మత్స్యకారులకు బోట్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్వల్ప వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన తిరుపతి, ప్రభాకర్, శ్రీనివాసులు మోహన్, రాజా, శివ కలిసి జాకీర్‌పై దాడి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వార్డు ఎన్నికలకు సన్నాహం

20న ఓటర్ల జాబితా ప్రచురణ

సూళ్లూరుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 16, 19 వార్డుల ఎన్నికలకు సన్నాహాలు మొదలయ్యాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 34 వార్డులకు ఈనెల 20వ తేదీన ఫొటో ఓటర్ల జాబితా ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో 16, 19 వార్డులు ఖాళీగా ఉన్నాయి. 16 వార్డు కౌన్సిలర్ తాళూరు వెంకట సురేష్ హత్యకు గురికాగా, 19 లింగారెడ్డి పరిమళ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరించే పనులు జరుగుతున్నాయని, ఈనెల 20న ఓటర్ల జాబితా ప్రచురిస్తామని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య చెప్పారు.

తిరుపతిలో భారీ వర్షం

ఉరుములు మెరుపులతో బెంబేలు

తిరుపతి అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. శుక్రవారం పగలంతా ఎండ తీవ్రత కొనసాగినా సాయంత్రానికి ఆకాశం మేఘావృతమైంది. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నగరవాసులను బెంబేలెత్తించింది. కాంతివంతమైన మెరుపులు, పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు భయకంపితులను చేశాయి. వాహనదారులు, పాదచారులు తడిసిముద్దయ్యారు. ఇళ్లకు పరుగులు తీశారు. పలుమార్లు విద్యుత్ అంతరాయం కలిగింది. జోరు వర్షానికి నగర వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాల్వలు పొంగిపొర్లాయి. రైల్వే అండర్ బ్రిడ్జిలు, ప్రధాన కూడళ్లలో నీరు నిల్వ ఏర్పడడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్లలో యాత్రికులు ఇబ్బంది పడ్డారు. కాగా, వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉక్కపోత నుంచి విముక్తి పొందారు.